


గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

● కలెక్టర్ సిరి



కర్నూలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్, సర్వేయర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ఎట్ టూ వ్యూ'లో అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించినా కొందరు అధికారులు వెనుకబడి ఉన్నారన్నారు. వెల్దుర్తి లాగిన్‌లో 3 రోజుల నుంచి 2 అర్జీలు, సి.బెళగల్ తహసీల్దార్ వద్ద పది రోజుల నుంచి ఒక అర్జీ, తహసీల్దార్, కల్లూరు, ఎమ్మిగనూరు వద్ద మూడు రోజుల నుంచి ఒక అర్జీ కనీసం చూడకుండా పెండింగ్‌లో ఉంచారని అసహనం వ్యక్తం చేశారు. మీ సేవ, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన 22-ఏలో మార్పులకు సంబంధించి వచ్చిన అర్జీలను త్వరితగతిన విచారణ చేసి పంపాలన్నారు. కొందరు సర్వేయర్లు, వీఆర్వోలు ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి వారిపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

హాస్టళ్లు పరిశుభ్రంగా ఉంచాలి

జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి కలెక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్వహణపై సంక్షేమ శాఖల అధికారులు, డీఈవో, రెసిడెన్షియల్ స్కూళ్ల కోఆర్డినేటర్లు, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. తాగునీటి ట్యాంకులను 15 రోజులకోసారి క్లీన్ చేయించాలన్నారు. హాస్టళ్లకు ఏఎన్ఎంలు 15 రోజులకు ఒకసారి వచ్చి వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

నియంత మాటలు మానుకో..

● వైఎస్ జగన్‌పై కుడా చైర్మన్ సోమిశెట్టి ఆగ్రహం



కర్నూలు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అహంకారం... నియంత మాటలు మానుకోవాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీని రద్దు చేసి కర్ణాటక రాజకీయాల్లోకి పోవాలని జగన్‌కు హితవు పలికారు. 2029లో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందంటూ జగన్ పగటి కలలు కంటున్నారన్నారు. వైసీపీ పాలనలో ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులు పోటీపడి మరీ రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలకు తెగబడుతున్నారని మండిపడ్డారు. 16 నెలలు జైలు జీవితం గడిపిన జగన్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ నాయకులకు సిగ్గు రావడం లేదని మండిపడ్డారు. అవినీతి సంపాదనతో తాడేపల్లి, బెంగళూరు, హైదరాబాద్, లండన్‌లో ప్యాలెస్‌లు నిర్మించుకున్న జగన్ అక్కడే ఉండిపోవాలన్నారు. బెంగళూరులో ఉంటూ కర్ణాటక రాజకీయాలు చూసుకోవాలన్నారు.

మల్లన్న భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం

● శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రమేశ్‌నాయుడు



శ్రీశైలం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు ఒకటో తేదీ నుంచి మల్లన్న భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాలు ఇవ్వనున్నట్లు చైర్మన్ రమేష్ నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్పర్శ దర్శనం టికెట్లు పొందిన వారికి రెండు లడ్డూలు, అతిశీఘ్ర దర్శనం టికెట్లు పొందిన వారికి ఒక లడ్డూను ఉచిత ప్రసాదంగా ఇవ్వనున్నారు. గోకులం ఆధునికీకరణ, నూతన డొనేషన్ కౌంటర్, చైర్మన్ చాంబర్, ఉచిత లడ్డూ ప్రసాద, కైలాస కంకణ కౌంటర్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

డోంట్ కేర్!

ఎవరెన్ని చెప్పినా మేం వినం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధన పత్తి రైతులను నానా ఇబ్బందిపెడుతోంది. పత్తిలో 8-12 శాతం తేమ ఉంటేనే కొంటామని సీసీఐ అధికారులు తేల్చి చెప్పున్నారు. దీని మీద సీఎం మొదలుకుని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు 14 శాతం తేమ ఉన్నా రైతుల నుంచి పత్తి కొనాలని ఆదేశించారు. పదే పదే ఉత్తర్వులు జారీ చేస్తున్నా సీసీఐ అధికారులు మాత్రం ఖాతర్ చేయడం లేదు. ఎవరేం చెప్పినా మా నిబంధనల మేరకే పత్తిని కొంటామంటున్నారు. దీనికి తోడు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవడం రైతులకు తలనెప్పిగా మారిపోయింది.



గ్రామాల్లో తక్కువ తూకాలతో జోరుగా పత్తి కొనుగోళ్లు

- ప్రకృతి వైపరీత్యాలతో సంబంధం లేదంటున్న సీసీఐ అధికారులు
- 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే పత్తి కొనుగోలు
- కపాస్ కిసాన్ అవాంతరాలపై నోరు మెదపని సీసీఐ
- ఇప్పటి దాకా సీసీఐ కొనుగోలు చేసింది 40 క్వింటాళ్లే..
- వ్యాపారులు కొన్నది 5 లక్షల క్వింటాళ్ల పైమాటే

● **రాష్ట్రంలోనే పత్తి సాగులోనే మొదటి స్థానం.. 7 లక్షల ఎకరాల్లో పత్తి సాగు :**

కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.8,110 మద్దతు ధరను ప్రకటించింది. దీంతో రైతులు ఖరీఫ్‌లో పెద్ద ఎత్తున పత్తి పంటను సాగు చేశారు. కర్నూలు జిల్లాలో 6,71,064 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా.. నంద్యాల జిల్లాలో మరో 30వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా పత్తి సాగులో ఈసారి మొదటి స్థానంలో నిలిచింది. ముందస్తు వర్షాలకు రైతులు మే చివరి వారంలోనే పత్తిని సాగు చేశారు. ప్రస్తుతం పెద్ద ఎత్తున రైతుల వద్ద పత్తి నిల్వ ఉంది. 5 క్వింటాళ్ల దిగుబడి మేరకు 7 లక్షల ఎకరాలకు 35 లక్షల క్వింటాళ్ల పత్తి రైతులు ఈసారి పండించారు. సీసీఐ సంస్థ రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయడంలో మొదటి నుంచి ఆటంకాలు పెడుతూనే వస్తుంది. రెండు నెలల క్రితమే రైతుల చేతికి పత్తి అందినా సీసీఐ అధికారులు మాత్రం అదిగో.. ఇదిగో అంటూ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తాత్సారం చేస్తూ వచ్చారు. చివరికి రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిళ్ల మేరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను గత నెల ఏర్పాటు చేసింది. రాష్ట్రం మొత్తం మీద పత్తి కొనుగోలుకు సీసీఐ అధికారులు 30 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అందులో 20 కేంద్రాలు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. అయితే.. అవన్నీ కాగితాలకే పరిమితమైపోయాయి. కర్నూలు జిల్లాలో 20 కేంద్రాలకు గాను కేవలం 11 కొనుగోలు కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఆదోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరులో సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. అయితే ఇంకా 9 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకుండానే చేతులెత్తేశారు. నంద్యాల జిల్లాలో కేవలం ఒకే ఒక్క కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



ఈ రైతు పేరు రాము. కల్లూరు మండలం గోకులపాడు గ్రామం. తనకున్న మూడెకరాల్లో ఖరీఫ్ పంటగా పత్తిని సాగు కోసం 60 వేల దాకా ఖర్చు పెట్టాడు. అధిక వర్షాల వల్ల ఎకరాకు 4 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. చేతికందిన 15 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోడానికి కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునేందుకు నానా తంటాలు పడ్డాడు. నెల రోజుల నుంచి స్లాట్ బుక్ కావడం లేదని, ఇంట్లోనే పత్తిని నిల్వ చేసుకుని అమ్ముకోలేకపోతున్నాని రాము ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లాలోని దాదాపు 3లక్షల మంది రైతులు ఎదుర్కొంటున్నారు.



అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి

నామ మాత్రంగానే కొనుగోళ్లు

రైతులు ఖరీఫ్‌లో పెద్ద ఎత్తున పత్తి పంటను సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ యంత్రాంగం ముందుగానే అంచనా వేసింది. అయితే అంచనాలకు తగ్గట్టుగా సీసీఐ అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోయారు. కర్నూలు జిల్లాలో ఆదోని నియోజకవర్గంలో 73,271 ఎకరాల్లో పత్తి పంట సాగైంది.

మిగతా 6లో..

స్పోర్ట్స్ స్కూల్‌పై వివక్ష



రెండేళ్లుగా స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థుల ప్రవేశాలు నిలిపేశారు. మూడు నెలల్లో చదువు పూర్తి చేసుకునే సమయంలో ప్రవేశాలు కోరడంతో తల్లిదండ్రుల నుంచి పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రీడాకారులకు అవసరమైన వసతులు, నిధులు, క్రీడా పరికరాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్న ఆరోపణలున్నాయి. 2017లో టీడీపీ, 2021లో వైసీపీ పలు చోట్ల గిరిజన స్పోర్ట్స్ స్కూళ్లను ప్రారంభించాయి. వాటిని అభివృద్ధి చేయడంలో వెనుకడుగు వేశాయి. 2021 ఫిబ్రవరిలో ప్రారంభించిన పాఠశాలల్లో 2022-23లో ప్రవేశాలు నిలిపివేశారు. మళ్లీ 2023-24 ఆగస్టులో ప్రవేశాలు నిర్వహించారు. 2024-25లో మళ్లీ ప్రవేశాలు నిలిపివేశారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రవేశ పరీక్షలు నిర్వహించాల్సిన ఏపీ గురుకుల పాఠశాలల సంస్థ విద్యాసంవత్సరం చివరిలో ప్రవేశ పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయడానికి దరఖాస్తులు కోరడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- విద్యా సంవత్సరం చివరిలో ప్రవేశాల కోసం దరఖాస్తులా?
- విద్యార్థులు జీవితాలతో చెలగాటం
- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న వైనం
- కరువైన కనీస వసతులు
- కనపడని మైదానాలు
- క్రీడల్లో ప్రాక్టీసు చేసేదేలా?

పాణ్యం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన స్పోర్ట్స్ స్కూళ్లపై ప్రభుత్వం వివక్ష చూపుతోంది. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. సమయం సందర్భం లేకుండా 2025-26 విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్న సమయంలో క్రీడా పాఠశాలలకు దరఖాస్తు కోరడం విడ్డూరంగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 27వ తేదీ లోపల బాలురు, 28వ తేదీ లోపు బాలికల స్పోర్ట్స్ స్కూల్స్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ శ్రీశైలం పీవో వెంకటశివప్రసాద్ ప్రకటించారు. 2017లో టీడీపీ ప్రభుత్వం విశాఖ ఏజన్సీ లోని అరకులో గిరిజన విద్యార్థులను క్రీడారంగంలో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా గిరిజన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసింది. దీంతో గిరిజన విద్యార్థులు క్రీడా రంగంలో రాణించడానికి మంచి అవకాశమేర్పడింది. కాగా ఈపాఠశాలకు దీటుగా మరిన్ని పాఠశాలలను ఏర్పాటు చేయడానికి వైసీపీ ప్రభుత్వం 2021 ఫిబ్రవరి 11న రాష్ట్ర వ్యాప్తంగా ఆరు ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూల్స్‌ను ఏర్పాటు చేసింది.

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ..

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (పీటీజీ చెంచు) శ్రీశైలం పరిధిలో అనంతపురం, కృష్ణా, కర్నూలు, చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, నంద్యాల జిల్లాల విద్యార్థినులకు నంద్యాల జిల్లా పాణ్యం మండలం బలపనూరు పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద గల ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాలను క్రీడా పాఠశాలగా 6, 7, 8 తరగతులను ఏర్పాటుచేసింది. క్రీడలపై ఆసక్తి గల బాలికలను 73మందిని క్రీడల్లో ఎంపిక చేసి 37 మందికి ప్రవేశం కల్పించారు.

మిగతా 6లో

పత్తి క్వింటా రూ.7,506



ఆదోని అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధర శుక్రవారం గరిష్ఠంగా క్వింటా రూ.7,506 పలికింది. వారం రోజులుగా ధరలు స్థిరంగా ఉన్నాయి. ధరలు పెరుగుతాయని రైతులు ఆశించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కంటే మార్కెట్‌లో పలుకుతున్న ధర క్వింటాకు రూ.1,200 తక్కువగా పలుకుతోంది. సీసీఐకి అమ్ముకోవడానికి సాంకేతిక సమస్య వల్ల స్లాట్ బుకింగ్ కాకపోవడంతో రైతులు పత్తిని మధ్యవర్తులకు విక్రయిస్తున్నారు. కాగా శుక్రవారం ఆదోని మార్కెట్‌కు 6,288 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4,059, సగటు ధర రూ.7,230, గరిష్ఠ ధర రూ.7,506 పలికింది.

బాలిక ప్రసవం!

● కడుపునొప్పితో ఆసుపత్రికి రాక.. ● ప్రసవం చేసిన వైద్యులు
● బంధువుల అబ్బాయే కారణమంటున్న మైనర్

నందికొట్కూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పూర్తిచేసిన ఓ బాలిక ప్రసవం అయిన సంఘటన నంద్యాల జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు తెలిపిన వివరాలు.. మిడ్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17.9 సంవత్సరాలు) ఇటీవలే ఇంటర్ పూర్తిచేసింది. గురువారం ఉదయం కడుపు నొప్పి రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆమె తల్లి తీసుకొచ్చారు. వైద్యులు పరిశీలించి పరీక్షలుచేసి చూడగా బాలిక కడుపుతో ఉందని తల్లికి చెప్పారు. అదే క్రమంలో పురిటి నొప్పులు రావడంతో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. తాను గత ఏడాది నందికొట్కూరులోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేశానని ఆ బాలిక తెలిపింది. ఆ సమయంలో నందికొట్కూరు మండలంలోని ఓగ్రామానికి చెందిన తమ బంధువుల అబ్బాయితో చనువుగా ఉన్నట్లు బాలిక తెలిపింది. ఆ సమయంలో అతడితో తరచూ బయటకు వెళ్లేదాన్ని అని బాలిక తెలిపింది. దీంతో పుట్టిన ఆడ శిశువును మీ వెంట తీసుకెళ్తారా? లేక చిల్డ్రన్‌హోంకు తీసుకెళ్లాలా? అని ఐసీడీఎస్ అధికారులు ప్రశ్నించారు. తన భర్తతో చర్చించి విషయాన్ని చెబుతా మని బాలిక తల్లి ఐసీడీఎస్ అధికారులకు వివరించారు. ఈఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

ఇంకెన్నాళ్లీ కష్టాలు

విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. అయినా పలుచోట్ల సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. అలాంటిదే కోడుమూరు మండలంలోని రామాపురం గ్రామ పాఠశాల పరిస్థితి. ఎన్నో ఏళ్లుగా సొంత భవనం లేక వేర్వేరు ప్రాంతాల్లో పాఠశాలను నిర్వహించారు. చివరకు రేకుల షెడ్డుకు మార్చారు. అక్కడ ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తోందని, ఏ పురుగో.. పుత్రో వస్తాయోననే భయంతో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యా శాఖాధికారులు స్పందించి నూతన పాఠశాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- కొన్నేళ్లుగా వేర్వేరు ప్రాంతాల్లో బడి నిర్వహణ
- ప్రస్తుతం రేకులషెడ్‌లో సాగుతున్న పాఠశాల
- భయాందోళనలో విద్యార్థులు



రేకుల షెడ్‌లో నిర్వహిస్తున్న పాఠశాల



అసంపూర్తిగా గదుల లోపలి భాగం

కోడుమూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి మజారా రామాపురం గ్రామంలో సుమారు 500 జనాభా ఉంది. ఇక్కడ ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. నిధులు మంజూరు కావడంతో 2019కు ముందు శిథిలమైన పాఠశాల గదులను కూలగొట్టారు. కొత్తగా గదుల నిర్మాణానికి పూనుకున్న కాంట్రాక్టర్ పునాదులు తవ్వారు. పనులు ప్రారంభించలేదు. ఉన్న గదులు తొలగించడం, కొత్త పనులు ఆగిపోవడంతో పాఠశాల గ్రామంలోని రామాలయానికి చేరింది. 2019, 2020, 2021 విద్యా సంవత్సరాలు ఆలయంలో ముగిశాయి. అనంతరం మరో ప్రాంతంలో ఉన్న గ్రామానికి చెం దిన ఓవ్యక్తి తన ఇల్లు ఇవ్వడంతో 2022-23 విద్యాసంవత్సరం గడిచింది. ఎండాకాలం సెలవుల్లో ఆవ్యక్తి కుటుంబంతో గ్రామానికి చేరాడు. 2023-24 కొత్తకాలనీ దగ్గర సుంకులమ్మ గుడి ఆవరణకు పాఠశాల చేరింది. మరోవైపు ఉపాధ్యాయులు, విద్యార్థుల ఇబ్బం దులపై వరుస పత్రికా కథనాలతో నాడు నేడు ఫేజ్-2 కింద నిధులు మంజూరయ్యాయి. రూ.40లక్షలతో రెండు గదులు, ప్రహరీ, కిచెన్ షెడ్, టాయ్‌లెట్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

10 సెంట్ల స్థలంలో: కొత్తకాలనీలో పాఠశాలకు ప్రభుత్వం కేటాయించిన 10 సెంట్ల స్థలంలో నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఈ సమయంలో సుంకులమ్మ గుడి ఆవరణలో ఉన్న పాఠశాల వర్షం సమయంలో విద్యార్థుల ఇబ్బందులను గమనించి సమీపంలో నివసిస్తున్న వ్యక్తి తన రేకుల షెడ్డులో పాఠశాలకు ఆశ్రయం కల్పించాడు. పాఠశాల గదులు, కిచెన్, టాయ్‌లెట్స్ స్లాబ్ పూర్తయ్యాయి. ఆ తర్వాత నిధులు లేక పనులు నిలిచిపోయాయి. ఇంకా ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు, ఎలక్ట్రిసిటీ, రంగులు వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పనులు ఆగిపోవడంతో పాఠశాల గదుల ముందు పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. పక్కనే ప్రస్తుతం పాఠశాల నిర్వహిస్తున్న రేకుల షెడ్ ఉండడంతో పురుగుపుట్రా భయం ఉంది.



అసంపూర్తిగా ఉన్న గదులు



గదుల ముందు పెరిగిన పిచ్చిమొక్కలు

ఒక్కరే ఉపాధ్యాయుడు

రామాపురం ప్రాథమిక పాఠశాలలో ఒకటో నుంచి 5వ తరగతి వరకు కలిపి మొత్తం 11 మంది విద్యార్థులు ఉన్నారు. అన్ని తరగతులను ఒక్కరే ఉపాధ్యాయుడు బోధిస్తున్నారు. ఏదైనా పాఠశాలకు సంబంధించిన పనులు, మీటింగ్ సమయాల్లో మరో పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని పంపుతున్నారు. అష్టకష్టాలు పడుతున్న పాఠశాల పరిస్థితిని చూసిన పలువురు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు చేర్చారు.

సుంకులమ్మది గొప్ప మనసు

పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసే సుంకులమ్మ అనే మహిళది గొప్ప మనసు అనవచ్చు. ప్రస్తుతం దినసరి కూలీ పనులకు వెళితే కనీసం రూ.300 అందుతుంది. ఆమె ఆరేళ్లుగా తక్కువ సంఖ్యలో ఉన్న విద్యార్థులకు రోజూ భోజనం వండి అందిస్తోంది.

జిల్లా కోర్టు పీపీగా రంగా రవికుమార్



జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంగా రవికుమార్

కర్నూలు లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది ఎస్.రంగా రవి కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించి జిల్లా ప్రధాన న్యాయాధి కారి జి.కబర్ధిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన 1993లో దివంగత సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరాములు ఆఫీసులో జూనియర్‌గా చేరి న్యాయ వాదిగా పలు కేసుల్లో వాదించారు. ఈయన పదవిలో మూడు సంవత్స రాలు కొనసాగుతారు. రవికుమార్ నియామకంపై సీనియర్ న్యాయవా దులు ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, శ్రీవాత్సవ, డి.శివశంకర్ రెడ్డి, పీవీ శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.హరినాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

న్యాయ సమీక్ష



రివ్యూ మీటింగ్ నిర్వహిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌పై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, బాధ్యతలు, సలహాలు, జైలు తని ఖీలు మొదలైన విషయాల గురించి వివరించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్ని క్రిమినల్ కేసులలో నిందితులకు బెయిల్ మంజూరయ్యేలా చేసిన కృషిని వివరించాలని ఆదేశించారు. ఈ మీటింగ్‌లో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఏ.సులోచన తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయీ సంఘ సమా వేశాలు నిర్వహించేం దుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10.00 గంటల నుంచి 11.00 గంటల వరకు 2వ, 11.00 నుంచి 12.00 గంటల వరకు 3వ, 12.00 గంటల నుంచి 1.00 గంటల వరకు 6వ స్థాయీ సంఘం సమావేశాలు ఉంటాయని వివరించారు. మధ్యాహ్నం 1.00 నుంచి 2.00 గంటల వరకు 4వ, 2.30 గంటల నుంచి 3.30వరకు 5వ, 3.30 నుంచి 5.30 వరకు 1, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు.

డిగ్రీలో ఐదుగురి డిబార్

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివ ర్సిటీ పరిధిలో నిర్వహించిన డిగ్రీ 3వ సెమిస్టర్లో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8,365 మంది దరఖాస్తు చేసుకోగా 7,560 మంది పరీక్షలకు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

పూలే మార్గంలో పయనించాలి

- డీబీసీడబ్ల్యూవో ప్రసూన
- జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పూలే దంపతులు బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని, యువత పూలే మార్గంలో పయ నించాలని డీబీసీడబ్ల్యూవో ప్రసూన అన్నారు. శుక్రవారం కర్నూలు నగరంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పూలే చిత్రపటా నికి డీబీసీడబ్ల్యూవో ప్రసూన, డీజీ డబ్ల్యూవో సురేష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీసీ డబ్ల్యూవో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అంజనేయులు, బీసీ, ఎస్టీ వెల్ఫేర్ కార్యాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.



బిర్లాగేటు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వై.నాగేశ్వరరావు యాదవ్

పూలే ఆశయాలను నెరవేరుద్దాం

రావు పూలే ఆశయాలను నెరవేరుద్దామని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వర రావు యాదవ్ పిలుపునిచ్చారు. బిర్లాగేటు సర్కిల్‌లోని ఏర్పాటుచేసిన మహాత్మా జ్యోతిరావు పూలే దం పతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, కుమ్మరి శాలివా హన సంక్షేమ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు సుగూరు వెంకటేశ్వర్లు, సత్రం రామకృష్ణ, శేషగిరి, పీవీ కృష్ణయ్య బీసీలు పాల్గొన్నారు.

టీటీసీ ఫలితాలు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్(టీటీసీ) పరీక్షా ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శుక్రవారం తెలిపారు. ఈ ఫలితాలను అధికారిక డీఈవో వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఉత్తీర్ణత సర్టిఫికెట్లను విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లాల విద్యాశాఖ అధికారులకు సకాలంలో పంపిస్తామని తెలిపారు.

డోంట్ కేర్

(5వ పేజీ తరువాయి)



కర్నూలు పెంచికలపాడులోని సీసీఐ కేంద్రం

ఆలూరులో 19,635 ఎకరాలు, ఆస్పరిలో 50,743 ఎకరాలు, సీ.బెళ గల్‌లో 25,568 ఎకరాలు, చిప్పగిరిలో 12,028 ఎకరాలు, దేవనకొం డలో 54,659 ఎకరాలు, గోనెగండ్లలో 35,190 ఎకరాలు, గూడూరులో 20,116 ఎకరాలు, హాలహర్విలో 9,966 ఎకరాలు, హొళగుందలో 36,693 ఎకరాలు, కల్లూరులో 20,456 ఎకరాలు, కోడుమూరులో 18,055 ఎకరాలు, కోసిగిలో 30,348 ఎకరాలు, కౌతాళంలో 59,697 ఎకరాలు, క్రిష్ణగిరిలో 24,056 ఎకరాలు, కర్నూలు రూరల్‌లో 15,203 ఎకరాలు, మంత్రాలయంలో 28,891 ఎకరాలు, నందవరంలో 44,241 ఎకరాలు, ఓర్వకల్లులో 5,652, పత్తికొండలో 20,320 ఎకరాలు, పెద్దక డుబూరులో 24,276 ఎకరాలు, ఎమ్మిగనూరులో 39,657 ఎకరాలు, వెల్దుర్తిలో 8,847 ఎకరాలు మొత్తం కర్నూలు జిల్లాలో 6,71,064 ఎక రాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారు. నంద్యాల జిల్లాలో మరో 30వేల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. ఎకరాకు 5 క్వింటాళ్ల చొప్పున 35 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి రాగా, ఇప్పటి దాకా సీసీఐ అధికా రులు రైతుల నుంచి కొనుగోలు చేసింది కేవలం 40 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే. సవాలక్ష ఆటంకాల మధ్య సీసీఐ కేంద్రాల్లో రైతులు పత్తిని అమ్ముకోలేకపోయారు. ఓ వైపు అప్పు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి, ఇంకో వైపు అధిక వర్షాల కారణంగా.. మరో దారి లేక రైతులు గ్రామాల్లోని వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు.

దాదాపు 5లక్షల క్వింటాళ్ల పత్తిని అమ్ము కున్నారు..: రైతులు చాలా మంది సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ము కుంటే.. ప్రభుత్వం నిర్ణయించిన క్వింటా నికి రూ.8,100 నుంచి రూ.7,500 దాకా చేతికి లభిస్తుందని రైతులు ఇళ్లలోనే పత్తిని బస్తాల్లో నింపి దాచుకున్నారు.

కపాస్ కిసాన్ యాప్‌తో తంటాలు

గత సంవత్సరం కేవలం ఈక్రాప్ యాప్‌లోనే రైతులు పత్తి వివ రాలను నమోదు చేసి సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్నారు. ఈసారి ఏదో విధంగా రైతుల నుంచి తక్కువ మొత్తంలోనే పత్తిని కొనుగోలు చేయాలనే తలంపుతో సీసీఐ అధికారులు రైతులకు రకర కాల ఆటంకాలను సృష్టిస్తూ వచ్చారు. కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌ను అమలులోకి తెచ్చారు. రైతులు నేరుగా కొనుగోలు కేంద్రా లకు పత్తిని తీసుకుని అమ్మే అవకాశం లేదని, ఈ యాప్‌లో ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న తర్వాతే ఖరారు చేసిన తేదీలో కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకెళ్లి అమ్మాలని అధికారులు ఆదేశిం చడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సర్వర్ సక్రమంగా పని చేయకపోవడంతో అధికా రులు నిర్ణయించిన సమయం ఉదయం 10 గంటలకు, కపాస్ కిసా న్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం లేకుండా పోయింది. గ్రామ రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు పనులు విడిచిపెట్టి కేంద్రాల వద్దే గంటల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూడాల్సి వస్తున్నది. కొన్నిసార్లు స్లాట్ బుక్ చేసుకున్నా కొనుగోలు కేంద్రాల వద్ద ఆ వివరాలను చూపిస్తే స్లాట్ బుక్ చేసినా రద్దయిం దని, మళ్లీ వెళ్లి స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పారు. రవాణా ఖర్చులు భరించే శక్తి లేక అక్కడే ఉన్న జిన్నింగ్ మిల్లులో క్వింటం పత్తిని రూ.6వేల నుంచి రూ.6,500కే అమ్ముకుని నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి కొనుగోలు కేంద్రాలు పని చేయకుండా ఉండ టంతో రైతులు వెనుదిరిగి రాలేక కొనుగోలు కేంద్రాల వద్దే కాచుక్కూ ర్చున్న వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు.

సీఎం, ఉన్నతాధికారులు చెప్పినా వినలేదు : సీసీఐ



ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుకుని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత, జిల్లా ఉన్న తాధికారులు ఎన్నోసార్లు రైతుల వద్ద ఉన్న పత్తి 14 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరెంత చెప్పినా తమ నిబంధనల మేరకే పత్తిని కొంటా మని సీసీఐ అధికారులు భీష్మించ డంతో రైతులు నష్టపోతున్నారు. సీసీఐ కేంద్రాల వద్ద ప్రస్తుతం పత్తిలో 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు. ప్రకృతి విపత్తులతో తమకు సంబంధం లేదని తేల్చి చెబుతున్నారు. కొన్ని కేంద్రాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు నామ్‌కే వాస్తేగా సీసీఐ అధికారులు 14 శాతం తేమ ఉన్నా రైతుల పరిస్థి తిని అర్థం చేసుకుని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం రైతుల వద్ద ఇంకా 30 లక్షల క్వింటాళ్ల మేర పత్తి నిల్వ ఉంది. సీసీఐ అధికారులు ప్రభుత్వ ఒత్తిడి మేరకు నిబంధనలను సడలించి తేమ శాతాన్ని 14 శాతం వరకు పరిగణనలోకి తీసుకుంటుందని, అప్పుడైనా పత్తిని అమ్ముకుని మద్దతు ధర పొందుదామని రైతులు ఇళ్ల లోనే పత్తి సంచులు నిల్వ చేసి ఆశగా ఎదురు చూస్తు న్నారు.

14 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేస్తామని సీసీఐ చెప్పింది



అధిక వర్షాల వల్ల రైతు లకు ఈసారి దిగుబడి బాగా తగ్గింది. కర్నూలు జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాలు, నంద్యాల జిల్లాలో ఒకటి కేంద్రాన్ని సీసీఐ అధికారులు ఏర్పాటు చేశారు. 8 నుంచి 11 శాతం తేమ ఉంటే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఒత్తిడి మేరకు ప్రస్తుతం 14 శాతం తేమ ఉన్నా రైతుల నుంచి కొను గోలు చేస్తున్నారు. కపాస్ కిసాన్ యాప్ వల్ల రైతులు ఇబ్బందులు పడ లేక వ్యాపారులకే ఎక్కువ మొత్తంలో పత్తిని అమ్ముకుం టున్నారు. త్వరలోనే ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 14 శాతం తేమ ఉంటే కూడా పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు నిర్ణయం తీసు కునే అవకాశం ఉంది. తక్కువ తూకాలు వేసి రైతుల నుంచి పత్తిని కొను గోలు చేసే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం.

- నారాయణమూర్తి, ఏడీఎం

ఎమ్మెల్యే పార్థసారథి

ఇంటిని ముట్టడించిన ప్రజలు



పెద్ద తుంబళం మండల కావాలంటూ ధర్నా చేస్తున్న పది గ్రామాల ప్రజలు

ఆదోని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్త మండలాల ఏర్పాటు విషయంలో ఆదోని నియోజకవర్గంలో రగడ రాజుకుంది. పెద్దతుంబళం గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పది గ్రామాల ప్రజలు శుక్రవారం 200 బైకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదోనిలోని ఎమ్మెల్యే పార్థ సారథి ఇంటిని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే పార్థసారథి స్పందిస్తూ ప్రజాభిప్రాయ సేకరణకు ప్రభుత్వం 30 రోజుల సమయం ఇచ్చిందన్నారు. ఈలోగా సమస్యను పరిష్కరిం చేందుకు కృషి చేస్తానన్నారు. ఇదిలా ఉండగా తమ గ్రామాలను ఆదోని మండలంలోనే ఉంచాలని చాగి, నారాయణపురం, ఢణా పురం, నాగనాథనహళ్లి, బసాపురం గ్రామాలకు చెందిన వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. తమ గ్రామాలను ప్రతిపాదిత పెద్దహరివాణం మండలంలో చేర్చకుండా గతంలో మాదిరిగానే ఆదోని మండలంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్త మండల కేంద్రం పెద్దహరివాణానికి దాదాపు 30 కిలో మీటర్ల దూరం ఉంటుందని, అదే ఆదోని అయితే ఆరు కిలోమీటర్ల లోపే ఉంటుందన్నారు. తమ గ్రామానికి మండలంగా గుర్తించినం దుకు పెద్దహరివాణం గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలి పారు.

పెరుగుతున్న జీడీపీ నీటి మట్టం



జీడీపీలోకి చేరుతున్న హెచ్ఎన్ఎస్ నీరు

గోనెగండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా(హెచ్ ఎన్ఎస్) నీరు నాలుగు రోజులుగా గాజులదిన్నె ప్రాజెక్టును చేరు తోంది. దీంతో ప్రాజెక్టు లో నీటి మట్టం పెరుగుతోంది. హంద్రీ-నీ వాలో పదిరోజుల క్రితం 250 క్యూసెక్కుల నీరు జీడీపీ కి విడుదల అయితే గత నాలుగు రోజులుగా జీడీపీకి 150 క్యూసెక్కులు చేరి నట్లు జీడీపీ అధికారులు తెలిపారు. ఈ కారణంగా ప్రాజెక్టులో ప్రస్తుతం 3.6 టీఎంసీ(గ్రాస్) నీరు చేరింది. హెచ్ఎన్ఎస్ ద్వారా విడుదల అయిన నీరు వాగులు, వంకలు ద్వారా వృథాగా పోగా జీడీపీలోకి చేరేలోపు 150 క్యూసెక్కులు చేరుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌కు గాను మూడు రోజుల క్రితం జీడీపీ నీరు విడుదల చేశారు. ఇప్పటి వరకు ప్రాజెక్ట్ కింద దాదాపు 13వేల ఎకరాలు సాగు అవుతున్నట్లు సమాచారం. పంటలు చేతికి అందే వరకు సాగు నీరు విడుదల చేయాల్సి వస్తుంది. అంటే వచ్చే ఏడాది మార్చి నెల చివరి వరకు సాగు నీరు అందించాల్సి ఉంటుంది.

క్వార్టర్ ఫైనల్‌కు ప్రవేశించిన జట్లు

- బేస్ బాల్‌లో ప్రతిభ చాటిన జిల్లాలు



క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న జట్లతో నిర్వాహకులు

ఆళ్లగడ్డ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అహోబిలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో జరుగుతున్న జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్‌కు చేరారు. శుక్రవారం జరిగిన అండర్-17 విభాగం బేస్ బాల్ పోటీలలో కడప, కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయన గరం, నెల్లూరు, వెస్ట్ గోదావరి, గుంటూరు జిల్లా లకు చెందిన క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. అలాగే బాలికల విభాగంలో విశాఖ పట్నం, కడప, కృష్ణా, శ్రీకాకుళం, చిత్తూరు, కర్నూలు, విజయనగరం, గుంటూరు జిల్లాలకు చెందిన క్రీడాకారులు క్వార్టర్స్‌లోకి ప్రవేశిం చారు. వీరు ఈనెల శనివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొంటారు. రెండు రోజులుగా వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని టోర్నమెంట్ నిర్వాహకులు నాగేంద్ర తెలిపారు. ఈ పోటీలను పారిశ్రామిక వేత్త చక్రం బీడీ షబ్బీర్, ముల్లా షఫీ, షాబుల్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు విశ్వనాథ్, ఆశాజ్యోతి, వివిధ జిల్లాల పీఈటీలు తిలకించారు.

స్పోర్ట్స్ స్కూల్‌పై వివక్ష

(5వ పేజీ తరువాయి)

పాఠశాలలు ప్రారంభించే సమయంలో వాటి అభివృద్ధికి రూ.30లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఒక్క పైసా కూడా రాలేదు. టీడీపీ హయాంలో విశాఖ ఏజన్సీ ప్రాంతంలోని అర కులో గిరిజన విద్యార్థులను క్రీడల్లో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేసింది. దీని కంటే మిన్నగా ఆరు పాఠశాలలను వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు.

ప్రత్యేక నిధులు కేటాయించకుండానే..

క్రీడా పాఠశాలకు ప్రత్యేక నిధులు కేటాయించకుండానే పాఠశాలలు ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబు అని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తు న్నాయి. స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన బాలికలకు రోజూ రూ.125లు కేటాయిం చాలి. సాధారణ బాలికలకు కేటాయించే రూ.47లోనే క్రీడా విద్యార్థులను సరిపుచ్చుతున్నారు. క్రీడాకారులు శారీరక ధృడత్వాన్ని పొందలేక క్రీడల్లో రాణించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో క్రీడాపాఠశాలలో చేరే విద్యార్థులు పాఠశాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రీడలకు అనువైన క్రీడా మైదానం లేకపోవడంతో ఇతర పాఠశాలల క్రీడామైదానాలపై ఆధారపడవ లసిన దుస్థితి ఏర్పడింది. క్రీడలకు సరైన ప్రోత్సాహం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. . గతంలో పాఠశాలలో చేరిన క్రీడాకారులు రెండేళ్లపాటు క్రీడా శిక్షణకు దూరమయ్యారు. ఈ ఏడాది ఎంపిక చేసిన విద్యార్థినులకు అదే పరిస్థితి కొనసాగితే లక్ష్యంతో చేరిన విద్యార్థుల ప రిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సరైన సమయం కాదు

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు, బ్యాక్‌లాగ్ కల్పించడం సంతోషించదగ్గ విష యమే కానీ ఈ విద్యా సంవత్సరం సగ భాగం పూర్తయిన తర్వాత అడ్మిషన్ కోరడం సరైంది కాదు. స్పోర్ట్స్ స్కూల్‌కు అన్ని ఏర్పాట్లు ఏప్రిల్, మే మాసంలో పూర్తిచేసి ఉంటే బాగుండేది.

- సిమియోన్, పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్

గురుకుల కమిషనర్ ఆదేశాల మేరకే..

రాష్ట్ర గురుకుల పాఠశాలల సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకే స్పోర్ట్స్ స్కూళ్లలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నాం. ఈఏడాదిగానీ, వచ్చే సంవత్స రానికి గానీ విద్యార్థులను పాఠశా లల్లో చేర్చుకోవచ్చు. ఇప్పటివరకు అడ్మి షన్లకు మాత్రమే ఆదేశాలు అందాయి. విద్యార్థులకు ఎటువంటి నిధులు గానీ, వ్యాయామ ఉపాధ్యాయులనుగానీ కేటాయించలేదు.

- వెంకట శివప్రసాద్, పీవో, ఐటీడీఏ శ్రీశైలం

తీర్మానం లేకుండా ఎలా?

- ఎవరి ప్రయోజనాల కోసం విశ్రామ్ సదన్?
- కర్నూలు జీజీహెచ్ హెచ్‌డీఎస్ సభ్యుడు బి.రామాంజనేయులు



కర్నూలు హస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హెచ్‌డీఎస్ తీర్మానం లేకుండా, ఎజెండా రూపొందించకుండా రూ.14.6 కోట్లతో విశ్రామ్ సద న్ భవన నిర్మాణాలు ఎలా చేపడతారని కర్నూలు జీజీహెచ్ హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ(హెచ్‌డీఎస్) సభ్యుడు బి.రామాంజనేయులు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన కర్నూలు జీజీహెచ్ లో విలేకరులతో మాట్లాడారు. విశ్రామ్ సదన్‌ను ఎవరి స్వలాభం కోసం కడుతున్నారనీ, దీని వల్ల ఉపయోగం రాజకీయ నేతలకా? అధికారులకా? అని ప్రశ్నించారు. విశ్రామ్ సదన్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. విశ్రామ్ సదన్ బదులు ఆసుపత్రిలో నిలిచిపోయిన ఐపీడీ (ఐపీవో) బ్లాక్ నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు.

నయా ట్రెండ్..

- అభిమాన నేతల పేర్లతో అంకెలు
- ప్రత్యేకతను సంతరించుకుంటున్న నంబర్ ప్లేట్లు



తెలంగాణలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటర మణరెడ్డి మోదీ పేరుతో కారు నంబర్ ప్లేట్‌ను తయారు చేయించిన దృశ్యం

ప్రస్తుతం వాహనాల నంబర్ ప్లేట్ల ఎంపికలో వాహనదారులు నయా ట్రెండ్ ఫాలో అవుతున్నారు. తమ అభిమాన నేతల పేర్లతో కూడిన విధంగా అంకెలతో రూపొందించిన వాహనాల నంబర్ ప్లేట్లను తయారు చేయించుకుంటున్నారు. తొలుత తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి తన అభిమాన నేత, ప్రధాని నరేంద్రమోదీ పేరు వచ్చే విధంగా 4749 నంబర్‌ను హిందీలో మోదీ అని అక్ష రాలు కనిపించే విధంగా తన కారు నంబర్ ప్లేట్‌ను తయారు చేయించారు. ఈ నంబర్ ప్లేట్.. ఏకంగా తెలుగు రాష్ట్రాల్లోనే ఓ ప్రత్యేకతను సొంతం చేసు కుంది. ఇందులో భాగంగా ఆత్మకూరుకి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి తన అభి మాన నేత, యూపీ సీఎం యోగి ఆది త్యానాథ్ పేరులో యోగి అని కనిపించా లన్న ఉద్దేశ్యంతో 4061 అంగ్లంలో యోగి అని కనిపించే విధంగా నంబర్ ప్లేట్‌ను తయారు చేయించుకున్నారు. ఇది కూడా స్థానికంగా ఒక ప్రత్యేకతను సంతరించు కుంది. వాస్తవానికి వాహనాల నంబర్ ప్లేట్ల ఎంపిక రవాణా శాఖ అధికారులు నిర్దేశించిన నిబంధనల ప్రకారం మాత్రమే ఉండాలి. ఫ్యాన్సీ, పేర్లతో కూడిన నంబర్ల వ్యవహారం నిబంధనలకు విరుద్ధమే అయినప్పటికీ చాలా మంది న్యూట్రెండ్‌ను ఫాలో అవు తున్నారు. ఏదిఏమైనా.. అభిమాన నేతల పేర్లతో కూడిన వాహ నాల నంబర్ ప్లేట్లు.. నయా ట్రెండ్‌లో ఉండటాన్ని చూసి జనం ఆశ్చర్యానికి లోనవుతున్నారు.



యోగి పేరుతో బైకు ముందు భాగంలో నంబర్ ప్లేటు



ఆత్మకూరులో యోగి పేరుతో బైకు నంబర్ ప్లేటు తయారు చేయించిన దృశ్యం

- ఆత్మకూరు, ఆంధ్రజ్యోతి

ప్యాపిలిలో ఏపీఐఐసీకి 4.96 ఎకరాల భూమి అప్పగింత

నంద్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు అధ్య క్షతన శుక్రవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినేట్ సమావేశంలో పలు అంశా లకు సంబంధించి ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలం మాధవరం గ్రామం లోని రూ.25.04 లక్షలు విలువ చేసే 4.96 ఎకరాల ప్రభుత్వ భూమిని(సర్వే నెంబర్ 691 లో 3.21 ఎకరాలు, సర్వే నెంబర్ 692లో 1.75 ఎకరాలు) ఉమ్మడి కర్నూలు జిల్లా ఏపీఐఐసీ అప్పగిస్తూ కేబినేట్ ఆమోదం తెలిసింది. సదరు భూమిని క్రషింగ్ అండ్ పల్వరైజింగ్ యూనిట్ ఏర్పాటు కోసం త్వరలో ఏపీఐఐసీ ప్రైవేట సంస్థకు అప్పగించనుంది.

రేపు కాంగ్రెస్ కార్యనిర్వాహక సమావేశం


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల నూనెపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో ఈనెల 30న నిర్వహించనున్న జిల్లా కార్యనిర్వాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఐసీసీ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి బెంగళూరు అభివృద్ధి అథారిటీ (బీడీఏ), శాంతినగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే, ఏఐసీసీ పరిశీలకుడు ఎన్ఏ హరిస్ ముఖ్యఅతిథిగా హాజరు అవుతారన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నాయకులు, నియోజవర్గ సమన్వయకర్తలు, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అవుకు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుర్రాల వీధికి చెందిన గుర్రాల రామస్వామి (48) కుటుంబ కలహాలతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాలివీ.. ఉదయం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లగా ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి రామస్వామిని చికిత్స కోసం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రామస్వామికి భార్య కళావతి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ దగ్ధం


దగ్ధమవుతున్న లారీ

పెద్దకడబూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నతుంబళం గ్రామ సమీపంలో శుక్రవారం లారీ మంటల్లో దగ్ధమైంది. వివరాలివీ.. తాండూరు నుంచి కేరళకు నాపబండ రాళ్లను వేసుకొని లారీ బయల్దేరింది. అయితే పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామ సమీపానికి రాగానే లారీలో మంటలు చెలరేగాయి. దీన్ని గమనించిన లారీ డ్రైవర్, క్లీనర్‌లు కిందకు దూకి దూరంగా వెళ్లిపోయారు. లారీ పూర్తిగా మంటలకు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ ఏర్పడుతుందని ఏపీ, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మాంటిస్సోరి పాఠశాలను సందర్శించారు. ఆ పాఠశాలలో జరిగే ఎన్‌సీసీ 28వ పటాలపు వార్షిక పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్నూలు గ్రూపు తల్ సైనిక శిక్షణా శిబిరంలో ఎన్‌సీసీ విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ విద్యార్థులు జాతీయస్థాయి శిబిరంలో పాల్గొని ఏపీ, తెలంగాణకు మంచి గౌరవాన్ని ఉన్నత స్థాయికి చేర్చాలన్నారు. ఎన్‌సీసీ గ్రూప్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు గ్రూపు ప్రధాన అధికారి కల్నల్, అలోక్ త్రిపాఠి, పరిపాలన అధికారి శశి కుమార్, కృపాసాగర్ పాల్గొన్నారు.


కమాండర్ నర్సింగ్ సైలానీ

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

- పత్తిని విక్రయించి వెళ్తుండగా ఘటన

ఎమ్మిగనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పత్తిని అమ్ముకునేందుకు వచ్చిన ఓ రైతు బైక్ ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఎమ్మిగనూరు పట్టణంలో శుక్రవారం జరిగింది. వివరాలివీ.. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన రైతు మాల రామకృష్ణ(60) తన పొలంలో పండించిన పత్తి పంటను ఓ వాహనంలో ఎమ్మిగనూరులో విక్రయించేందుకు తీసుకొచ్చాడు. మంత్రాలయం రోడ్డులో ఉన్న జిన్నింగ్ మిల్లులో పత్తిని విక్రయించాడు. పత్తిని తీసుకొచ్చిన వాహనంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణంలోని మార్కెట్ కమిటీ సర్కిల్‌లో టీ తాగేందుకు వాహనాన్ని రోడ్డుపక్కన ఆపారు. వాహనం డ్రైవర్, రైతు రామకృష్ణ రోడ్డుకు అటువైపు ఉన్న హోటల్‌లో టీ తాగి తిరిగి వాహనం దగ్గరకు వస్తుండగా మంత్రాలయం వైపు నుంచి వస్తున్న బైకు రామకృష్ణను ఢీకొట్టింది. దీంతో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. రైతును ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు, వాహనం డ్రైవర్‌తో కలిసి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రామకృష్ణను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆసుపత్రిలో చేర్పించారు. అయితే ఆ తర్వాత ద్విచక్ర వాహనదారుడు ఆసుపత్రినుంచి చెప్పా పెట్టకుండా ఉడాయించాడు. కాగా వైద్యులు పరీక్షించి చికిత్స అందించేలోపే రైతు మతిచెందాడు. ఈ మేరకు పట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణకు భార్య రేణుకమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పెద్దహరివాణం మండలంపై అభ్యంతరాలకు అవకాశం

- 30 రోజుల గడువు: కలెక్టర్ సిరి



కర్నూలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతి పెద్ద మండలంగా ఉన్న ఆదోని నుంచి కొత్తగా పెద్దహరివాణం మండలంగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఆదోని మండలం పరిధిలో 29 గ్రామాలు, పెద్ద హరివాణం మండలంలో 17 గ్రామాలు చేర్చారు. ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచి 30 రోజుల్లోగా లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ సిరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను కలెక్టర్ చాంబర్‌లోనే అందజేయాల్సి ఉంటుంది. లిఖిత పూర్వకంగా మాత్రమే తీసుకుంటారు.

మండల విభజనలోనూ లోపాలు..

ఆదోని మండలాన్ని నాలుగు మండలాలుగా విభజించాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వం పెద్దహరివాణం మండలాన్ని మాత్రమే కొత్తగా కేటాయించింది. అయితే ఆదోని మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన కల్లుబావి, పర్వతాపురం గ్రామాలను పెద్దహరివాణంలో చేర్చడం విమర్శలకు తావిస్తోంది. మున్సిపాలిటీలో వార్డులుగా ఉన్న ఆ గ్రామాలు పెద్దహరివాణంలో ఎలా విలీనం చేస్తారని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే ఆదోని మండలంలోని అలసందగుత్తి, సాదాపురం గ్రామాలను ఈ రెండు మండలాల్లో కూడా చూపకపోవడం కొసమెరుపు. ఆదోనికి అత్యంత సమీపంలో ఉన్న నారాయణపురం, చాగి, ఢనాపురం, నాగనాతనహల్లి, బసాపురం, మదిరె, కడితోట గ్రామాలను పెద్దహరివాణం మండలంలో ఎలా చేరుస్తారని నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

పదమ్మా పోదాం.. మన ఇంటికి..!

ఎన్నెన్నో కలలు కంటూ పుట్టింటి నుంచి మెట్టినింట అడుగుపెట్టిన అమూల్య.. తిరిగి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పగింతల నాడు భర్తతో కలిసి వెళ్లిన తమ బిడ్డను 'చల్లగా వెళ్లిరా తల్లీ..' అని చెమ్మగిల్లిన కళ్లతో దీవించిన తల్లిదండ్రులు, ఇప్పుడు గుండె పగిలేలా ఏడుస్తూ విగతజీవిగా మారిన తమ బిడ్డను తీసుకుపోయారు. అప్పుడు ఒంటరిగా మెట్టినింటికి వచ్చిన అమూల్య.. ఇప్పుడు తన ప్రాణప్రదమైన కొడుకును వెంట తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మెట్టినింటితో మాత్రమే బంధం తెంచుకుని వెళ్లుంటే.. బాగుండేదేమో..! కానీ లోకంతోనే బంధం తెచుకుని, కొడుకుతో కలిసి వెళ్లిపోతూ.. కన్నవారికి గుండెకోతను మిగిల్చింది.


భర్త, కొడుకుతో అమూల్య(ఫైల్)

- కొడుకుతో కలిసి పుట్టినింటికి.. అమూల్య
- పోస్టుమార్టం అనంతరం మృతదేహాల తరలింపు
- డీటీ రవికుమార్, ఆయన తల్లిదండ్రులపై ఫిర్యాదు
- అర్ధరాత్రి కేసు నమోదు చేసిన అనంతపురం వన్‌టౌన్ పోలీసులు
- అదనపు కట్నం కోసం వేధింపులే కారణమని స్పష్టం

అనంతపురం క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'అమూల్య' జీవితం అర్ధాంతరంగా ముగియడానికి భర్త వేధింపులే కారణమని అర్థమవుతోంది. 'పెళ్లి సమయంలో రూ.70లక్షలకు పైగా కట్నం ఇచ్చాం. ఇల్లు కట్టుకునేందుకు ఇంకా డబ్బు కావాలని వేధించాడు. డబ్బులకే కాదు.. వేరే విషయాల్లోనూ వేధించాడు..' అని అమూల్య దగ్గరి బంధువు ఒకరు మీడియా ఎదుట కంటతడి పెట్టారు. అతన్ని కఠినంగా శిక్షించి, మాకు ఉపశమనం కలిగించాలి అని ప్రభుత్వానికి విన్నవించాడు. బాధిత కుటుంబ సభ్యులు పలువురు అమూల్య భర్త తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేధింపుల కారణంగానే పసివాడిని చంపేసి అమూల్య తనతో తీసుకువెళ్లిందని కంటతడి పెట్టారు. ముద్దుల కొడుకుతో, భర్తతో ప్రశాంతంగా జీవించాల్సిన అమూల్య ఇలా బలవన్మరణానికి పాల్పడటం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి డిప్యూటీ తహసీల్దారు రవికుమార్‌కు కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన రామకృష్ణ, రమాదేవి దంపతుల కూతురు అమూల్యను ఇచ్చి ఐదేళ్ల కిందట వివాహం జరిపించారు. వీరికి సహర్ష అనే బాలుడు సంతానం. వీరు అనంతపురం నగరంలోని జేఎన్టీయూ రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నారు. కాగా అమూల్య, కుమారుడు సహర్ష అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. భర్త వేధింపులను భరించలేక.. కన్నకొడుకును చంపేసి, అమూల్య ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

ముగ్గురిపై ఫిర్యాదు

తమ అల్లుడు రవికుమార్ వేధింపుల కారణంగానే తమ కూతురు అమూల్య, మనవడు సహర్ష ప్రాణాలను కోల్పోయారని ఆమె తల్లిదండ్రులు రామకృష్ణ, రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం కోసం రవికుమార్ తమ కూతురును వేధించారని, అల్లుడితోపాటు అతడి తల్లిదండ్రులు కుళ్లాయప్ప, శివాంజినమ్మ కూడా వేధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో వరకట్నం ఇచ్చినా, అదనపు కట్నం కోసం వేధించారని పేర్కొన్నారు. అల్లుడు, అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాలని కోరారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటన జరిగిన రోజు అర్ధరాత్రి బీఎన్ఎస్ 304బి కింద కేసు నమోదు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు. ఒకటి రెండు రోజుల్లో అరెస్టు చూపించే అవకాశం ఉందని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.


అమ్మా నిన్నెప్పుడు చూడాలి.. రోదిస్తున్న తల్లి, బంధువులు

మీతో బంధం చాలు..

తల్లీకొడుకుల మృతదేహాలకు సంఘటనా స్థలం నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గురువారం అర్ధరాత్రి తరలించారు. వైద్యులు, ఫోరెన్సిక్ అధికారులు, పోలీసుల సమక్షంలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ అధికారులు సమగ్ర వివరాలను సేకరించారు. పోస్టుమార్టం అనంతరం అమూల్య, ఆమె కుమారుడి మృతదేహాలకు తమకు అప్పగించాలని రవి, ఆమె బంధువులు డిమాండ్ చేశారు. దీనికి అమూల్య తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. 'ఇక మీ బంధం చాలనుకునే మా అమ్మాయి ఇలా చేసుకుంది. మేమే ఇద్దరి మృతదేహాలను తీసుకువెళతాం..' అన్నారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని, అమూల్య కుటుంబానికే ఎక్కువ నష్టం జరిగిందని, వారే మృతదేహాలను తీసుకువెళ్లడం సరైనదని అన్నారు. మృతదేహాలను శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అప్పగించారు. తమ స్వగ్రామం కర్నూలు జిల్లా వెల్దురికి ఇద్దరి మృతదేహాలను అమూల్య కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు.

కనీస సౌకర్యాలు కల్పిస్తాం

- కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీబీసీడబ్ల్యూవో
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై ఆగ్రహం



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి ప్రసూన

కోసిగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ప్రసూన చెప్పారు. కోసిగిలో సంక్షేమ హాస్టళ్ల గజ గజ.. అనే శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. రాత్రి 9 గంటల సమయంలో అధికారి ఆకస్మికంగా కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో కిటికీలు, దుప్పట్లు లేక ఇబ్బందులుపడు తున్నామని, మెనూ ప్రకారం భోజనం సక్రమంగా పెట్టడం లేదని, నైట్‌వాచ్‌మెన్, వార్డెన్ సిబ్బంది అందుబాటులో లేరని జిల్లా అధికారిణి ముందు విద్యార్థులు మొర పెట్టుకున్నారు. హాస్టల్ వార్డెన్, కమాటి, నైట్ వాచ్‌మెన్లపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట మాస్టర్లను మార్చి కొత్తవారిని ఏర్పాటు చేస్తామని, ప్రైవేటు వ్యక్తులతో వంట చేయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాకు 3వేల దుప్పట్లు రావాల్సి ఉందని, త్వరలోనే దుప్పట్లు హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు హాస్టల్ వార్డెన్లు విశ్వనాథ్ రెడ్డి, హారతి, కోసిగి హాస్టల్ వార్డెన్ గోపాల్, కమాటి ప్రసాద్, నైట్ వాచ్‌మెన్ రామయ్య ఉన్నారు.

వాహనాల తనిఖీల్లో.. 21 సెల్‌ఫోన్లు స్వాధీనం: సీఐ


నిందితులను చూపుతున్న సీఐ ఇంతియాజ్ బాషా


డోన్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు వాహనాల తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు మైనర్ల నుంచి 21 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు. వివరాలు.. శుక్రవారం జాతీయ రహదారి 44పై మ్యాక్స్ హోటల్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇద్దరు మైనర్లు అనుమానాస్పదంగా పారిపోవడానికి యత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 21 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాదులో రద్దీ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. అపహరించిన ఫోన్లను వారి తండ్రులు రాంబాబు, ఎంకన్నకు అందజేసేవారని, వాటిని అమ్మి డబ్బులు సంపాదించేవారు. ఇద్దరు మైనర్లను జేసీఎల్ (జువైనల్ కంప్లికేట్ విత్ లా)-1, జేసీఎల్-2గా నమోదుచేసి వారి సంరక్షకులను పిలిపించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఇద్దరు మైనర్లతో పాటు వారి తండ్రులు రాంబాబు, ఎంకన్నను ఏ-3, ఏ-4గా గుర్తించారు. సెల్ ఫోన్ల యజమానులను గుర్తించి వారికి తిరిగి అందజేయుటకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాకేష్, ప్యాపిలి సీఐ వెంకట్రామిరెడ్డి, సబ్ డివిజన్ ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, నాగార్జున, మధుసూదన్, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడి టేషన్ కార్డుల కాలపరిమితిని మరో రెండు నెలల పాటు డిసెంబరు 1నుంచి వచ్చే ఏడాది జనవరి 31 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ, ఏదీ ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం నవంబరు 30 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో రెండు నెలల పాటు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు తెలియజేశారు.

జిల్లాలో మరో నాలుగు పత్తి కొనుగోలు కేంద్రాలు

- ఏడీఎం నారాయణమూర్తి



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో మరో నాలుగు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి వెల్లడించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు మార్కెటింగ్ శాఖ అధికార యంత్రాంగం ప్రతి రోజూ జిన్నింగ్ మిల్లులో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి దాకా 6,276 మంది రైతుల నుంచి 1,81,466 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందుకుగానూ రూ.142.29 కోట్లు రైతులకు చెల్లించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సీసీఐ ఉన్నతాధికారులు సోమవారం నుంచి మరో నాలుగు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో 15 కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు జరుగుతాయని స్పష్టం చేశారు. ఆదోనిలోనీ ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ ఫ్యాక్టరీ, బత్తిని జిన్నింగ్ మిల్లు, ఐశ్వర్య జిన్నింగ్ మిల్లు, విఘ్నేశ్వరి జిన్నింగ్ మిల్లు, శ్రీలక్ష్మి జిన్నింగ్ మిల్లు, ధర్మ జిన్నింగ్ ఫ్యాక్టరీ, ఎమ్మిగనూరులో ఎస్ఆర్‌పీవో మహాలక్ష్మి కాటన్ మిల్లు, శ్రీమురారి జిన్నింగ్ మిల్లు, మాదవ కాటన్ జిన్నింగ్ మిల్లు, శ్రీశివ జిన్నింగ్ అండ్ ప్రాసిసింగ్ మిల్లు, అదే విధంగా కోడుమూరులో మంజిత్ కాటన్ మిల్లు, మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లుల నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టామన్నారు. రైతులుపత్తి అమ్ముకునేందుకు సీసీఐ అధికారులు సూచించిన ప్రమాణాలు పాటించాలని సూచించారు. రైతులు ప్రస్తుతం రెండో విడత పొలాల్లో తీసిన పత్తిని అమ్ముకునేందుకు సీసీఐ అవకాశం కల్పించిందన్నారు. రైతులు కపాస్ కిసాన్‌యాప్‌లో స్లాట్లను బుక్ చేసుకుని వెంటనే సూచించిన తేదీ మేరకు పత్తిని అమ్ముకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కోడుమూరు మార్కెట్ కమిటి సెక్రటరీ సుందర్‌రాజు, ఎమ్మిగనూరుసెక్రటరీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- చైర్మన్ ఎం.వెంకట హరినాథ్


బాధితులకు చెక్కును అందజేస్తున్న చైర్మన్ వెంకట హరినాథ్

కర్నూలు లీగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించి సత్వర న్యాయం పొందవచ్చని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్ తెలియజేశారు. ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏమైనా వివాదాలు ఉంటే బాధితులు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలని ఆయన తెలిపారు. ఈ వివాదాల పరిష్కారానికి ఎటువంటి ఖర్చులు లేకుండా సత్వర న్యాయాన్ని ఉచితంగా రాజీ మార్గం ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ తీర్పులపై ఎటువంటి అప్పీలు ఉండవన్నారు. శుక్రవారం ఇన్సూరెన్స్ వివాదానికి సంబంధించిన ఓ కేసును సత్వరంగా పరిష్కరించినట్లు తెలిపారు. స్థానిక ఫిర్యాది తోట బుచ్చి అబ్బి 2019లో తన కుటుంబం మొత్తానికి స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ నుంచి ఒక మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకున్నాడు. ఆ తర్వాత ఆయన కుటుంబంలోని ఓ సభ్యుడు అనారోగ్యంతో ఆర్కా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. చికిత్సకు అయిన మొత్తాన్ని రూ.7,82,880 నగదును స్థానిక ఆర్కా ఆసుపత్రికి చెల్లించాడు. ఆ మొత్తాన్ని స్టార్ ఇన్సూ రెన్స్ కంపెనీకి క్లయిమ్ చేయగా.. వారు కేవలం రూ.2లక్షలు మాత్రమే చెల్లించారు. దీంతో మిగతా క్లయిమ్ మొత్తం కోసం ఫిర్యాది శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసును విచారించిన లోక్ అదాలత్ ఇరు పార్టీల రాజీ మేరకు ఫిర్యాదికి రూ.4,82,072 మొత్తాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించింది.

పవర్‌గ్రిడ్ సిబ్బంది దౌర్జన్యం

- అనుమతుల్లేకుండా పొలాల్లో పనులు
- నిరసన తెలిపిన రైతులు
- అబ్దులాపురంలో స్వల్ప ఉద్రిక్తత


సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రైతులు

కొలిమిగుండ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్దులాపురం, కోరుమానుపల్లెలో పవర్‌గ్రిడ్ సిబ్బంది రైతులపై దౌర్జన్యానికి పాల్పడింది. వారి అనుమతులు లేకుండానే విద్యుత్ టవర్లు, లైన్లు ఏర్పాటుచేస్తూ పంటలను ధ్వంసం చేసిందని రైతులు వాపోతున్నారు. శుక్రవారం రైతులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని నందిపాడు వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న పవర్‌గ్రిడ్ కేంద్రం నుంచి అనంతపురం జిల్లాకు 400కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను పవర్‌గ్రిడ్ చేపడుతుంది. ప్రస్తుతం పంటలు సాగులో ఉన్నా రైతులకు పరిహారం చెల్లించకుండా, సమాచారమి వ్వకుండా పనులు చేపడుతున్నారు. గురు, శుక్రవారాల్లో అబ్దులాపురం గ్రామానికి చెందిన రైతులు పవర్‌గ్రిడ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగి పనులను అడ్డుకున్నారు. రైతులతో చర్చించి, పరిహారం అందజేసి పనులు చేపట్టాలని రైతులు సంజప్ప, అంకాలు, బాబు, రాజేంద్రప్రసాద్, ఆదిరెడ్డి తదితరులు డిమాండ్‌చేశారు. నిబంధనలు పాటించకుండా రైతులపై దౌర్జన్యం చేస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

పశువుల హాస్టల్ పరిశీలన

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తడకనపల్లె గ్రామంలోని పశువుల హాస్టల్‌ను చీఫ్ క్వాలిటీ కంట్రోల్, చీఫ్ విజిలెన్స్, పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనర్ గోపిచంద్ పరిశీలించారు. శుక్రవారం కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన కల్లూరు మండలం తడకనపల్లెలో పర్యటించి పశు వసతి కేంద్రాన్ని సందర్శించారు. హాస్టల్ నిర్మాణ పనులు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. డ్వామా పీడీ వెంకట రమణయ్య, పశుసంవర్ధక శాఖ ఏడీఏ పార్థసారథి, వెటర్నరీ సర్జన్ శ్రీకాంత్ రెడ్డి, పొదుపుసంఘం నాయకురాలు జుబేదాబేగం పాల్గొన్నారు.

పీహెచ్‌ఎన్‌లుగా పదోన్నతి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖ కడప జోనల్ పరిధిలో పని చేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ (ఫీమేల్)లకు పీహెచ్ఎన్ (నాన్ టీచింగ్)లుగా పదోన్నతి కల్పించారు. శుక్రవారం కడపలో ఆర్‌డీ డా.రామగిడ్డయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ఉమ్మడి జిల్లాలో 19 మందికి పీహెచ్‌ఎన్‌లుగా పదోన్నతులు లభించాయి. ఇందులో కర్నూలు జిల్లాలో 7 మంది మహిళా ఉద్యోగులు కాగా మిగిలిన వారు నంద్యాల జిల్లాలో స్థానాలు తీసుకున్నారు.

తవ్వారు.. పూడ్చారు.. వదిలేశారు

- నరసింహా రెడ్డి నగర్‌లో రోడ్డుపైనే వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



నగరంలోని ఎన్.ఆర్.నగర్‌లో రోడ్డుకు అడ్డంగా వ్యర్థాలు



జలమండలి కార్యాలయం వద్ద ఇలా..

కర్నూలు న్యూసిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నరసింహారెడ్డి నగర్ నుంచి అశోక్‌నగర్ రహదారిలో నిర్మాణ వ్యర్థాలు రహదారికి అడ్డంగా ఉన్నాయి. ఇక్కడ రోడ్డు మధ్యలో స్పీడ్ బ్రేకర్లను తొలగించి, గుంతలను పూడ్చారు. అయితే అక్కడ తవ్వి వదిలేసిన మట్టి, ఇతర వ్యర్థాలను అలాగే వదిలేయడంతో పాదచారులు, ప్రధానంగా మలుపు వద్ద అటువైపు నుంచి వాహనాలు కనిపించడం లేదు. దీంతో ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. అలాగే జలమండలి కార్యాలయం వద్ద ఫుట్‌పాత్‌ను తవ్వి అలాగే వదిలేశారు. నగర పాలక అధికారులు వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు సూట్ రూమ్‌ల ప్రారంభం

కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దాసుపత్రిలో టీజీవీ ఫౌండేషన్ నిర్మించిన సూట్ రూమ్‌లను శనివారం మంత్రి టీజీ భరత్ ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు తెలిపారు. పేయింగ్ బ్లాక్‌లో రూ.41 లక్షలతో నాలుగు రూమ్‌లతో పాటు ఇతర గదులను మంత్రి ప్రారంభిస్తారన్నారు.

పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

సి.బెళగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రాణెమ్మ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రం, పోలకల్లు, ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. తాగునీరు, సీసీరోడ్డు, మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

కాంగ్రెస్ నగర అధ్యక్ష పదవికి దరఖాస్తులు

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కర్నూలు నగర అధ్యక్ష పదవికి శనివారం సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఐసీసీ సభ్యుడు యోగేష్ ప్రకటనలో కోరారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రక్షాళనలో భాగంగా పార్టీని బలోపేతం చేసేందుకు నియమిస్తున్నామన్నారు. పార్టీ సిద్ధాంతాలు, విలువలకు కట్టుబడి, పార్టీ బలోపేతానికి కృషిచేయగల ఆసక్తిగల ఆశావహుల దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన ఎంపీ

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెనాయుడుని ఎంపీ బస్తిపాటి నాగరాజు శుక్రవారం విజయవాడలో కలిశారు. జిల్లాలో నిర్వహిస్తున్న రైతన్నా మీ కోసం కార్యక్రమాల గురించి ఎంపీ మంత్రికి వివరించారు. అనంతరం విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారిని ఎంపీ బస్తిపాటి నాగరాజు దర్శించుకున్నారు. కురువ కార్పొరేషన్‌డైరెక్టర్ రామకృష్ణ, దిశ కమిటీ సభ్యులు దేవ శంకర్ ఉన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న ఎంపీ

దేశానికి రైతు వెన్నెముక: ఎమ్మెల్యే



రైతులతో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతు దేశానికి వెన్నెముక అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్రేవుల గ్రామంలో ఏవో మల్లేష్ కుమార్ అధ్యక్షతన రైతన్న మీకోసం' నిర్వహించారు. ఎమ్మెల్యే మట్లాడుతూ రైత దేశానికి అన్నం పెడుతున్నాడన్నారు. రైతులకు ఇచ్చిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌తో రూ 6, 310 కోట్లను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందన్నారు. టీడీపీ కన్వీనర్, చంద్రశేఖర్, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, టీడీపీ నాయకులు అమర్, బాబు, హరి, పౌలు పాల్గొన్నారు.

నగర పాలక దుకాణాల వేలం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు చెందిన దుకాణాలకు శుక్రవారం వేలం నిర్వహించారు. ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో ఆర్వో జునైద్, సూపరింటెండెంట్ వాజిద్ కలసి వేలం నిర్వహించారు. పెద్దమార్కెట్ సమీపంలోని దుకాణాన్ని గణేష్ అనే వ్యక్తి రూ.1.35 లక్షలకు దక్కించుకున్నారు. కింగ్ మార్కెట్, వినాయకఘాట్, బంగి అనంతయ్య కాంప్లెక్స్ తదితర దుకాణాల వేలం నిర్వహించారు. ఆర్ఐలు సొహైల్, భార్గవ్, సిబ్బంది వెంకటరమణ, ఓమేష్, శంకర్, రాజు పాల్గొన్నారు



వేలం నిర్వహిస్తున్న ఆర్వో జునైద్

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ ఆదోని మండలం నాగలాపురం గ్రామంలో ఫుడ్‌పాయిజన్‌తో ఇద్దరు పిల్లలు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. ఈ సంఘటనకు కారణంగా అంగన్‌వాడీ వర్కర్, ఆయాపై కఠిన చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. పీఎస్.రాధాక్రిష్ణ, ఎండి.అంజిబాబు, ఎం.గోపాల్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు వినతి

కల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వేడుకలకు టీటీడీ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు ఇచ్చేలా చూడాలని విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.పార్వతమ్మ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం తిరుపతిలో టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు బి.రాజగోపాల్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ధనాలకోట శోభన్‌బాబు, డాక్టర్ కొత్తపల్లి.సత్యనారాయణ హాజరయ్యారు. ప్రతి ఏడాది శివరాత్రి రోజు వీరబ్రహ్మేంద్రస్వామి దంపతుల కల్యాణం, జీవసమాధి, మనవరాలు ఈశ్వరిమాత ఆరాధనోత్సవాల్లో టీటీడీ తరుపున పట్టువస్త్రాలు సమర్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన బీఆర్.నాయుడు మాట్లాడుతూ పాలక మండలిలో చర్చించి, అమోదం పొందేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



చైర్మన్‌ను కలిసిన పార్వతమ్మ

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధిత రైతులు

కర్నూలు రూరల్ నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలం మీదివేములలో పరిశ్రమ ఏర్పాటుకు ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని భూ నిర్వాసితుల కమిటీ నాయకుడు నాగన్న, సీఐటీయూ జిల్లా ఉపాధక్ష్యుడు గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు ఆర్డీవో కార్యలయం వద్ద శుక్రవారం భూనిర్వాసితులతో కలిసి రైతు సంఘం కార్యదర్శి మధుసూదన్ అధ్యక్షతన ధర్నా చేశారు. పరిశ్రమల హబ్‌గా ఏర్పాటు చేసి 30వేల ఎకరాలకు పైగా భూములు సేకరించి, భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం ఆర్డీవో కార్యలయ ఏవో వేణుగోపాల్ రావుకు వినతిపత్రం అందజేశారు. హరిస్వరాలు, ఎల్లయ్య, కృష్ణవేణమ్మ, నాగమ్మ ఉన్నారు.

రైతులను కష్టపెట్టొద్దు

- జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్
- కర్నూలు మార్కెట్ యార్డు తనిఖీ



మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న జేసీ నూరుల్ కమర్

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు కష్టం, నష్టం కలిగించవద్దని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డును తనిఖీ చేశారు. సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మితో పాటు సిబ్బంది జేసీకి బొకే అందించారు. జేసీ మార్కెట్ యార్డులో కలియ తిరిగి, పంట ఉత్పత్తుల అమ్మకాలు, ప్లాట్‌ఫారాలను రైతుల కోసం నిర్వహిస్తున్న భోజన హాల్లట డైనింగ్ హాలు, వాష్‌రూమ్‌లు, మినిరల్ వాటర్ ప్లాంటు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. మార్కెట్ యార్డును శుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజు చెత్తను తొలగించాలని, తూకాల్లో ఖచ్చితత్వం ఉండాలని, సెక్రటరీతో పాటు సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు నిఘా ఉంచాలని ఆదేశించారు. అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్, అకౌంటెంట్ కిషన్‌సింగ్ రెడ్డి ఉన్నారు.

తడి, పొడి చెత్త వేరుచేయాలి

- డంప్‌యార్డును తనిఖీ చేసిన కమిషనర్ విశ్వనాథ్



కుక్కల షెడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు, వ్యాపారులు తడి-పొడి చెత్తను వేరు సిబ్బందికి ఇవ్వాలని కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం గార్గేయపురం డంప్‌యార్డును పరిశీలించారు. యంత్రాలు, వర్మికంపోస్టు పిట్స్, కంపోస్టు తయారీ యూనిట్, కుక్కల సంతాన నియంత్రణ కేంద్రం, చెత్త వర్గీకరణను తనిఖీ చేశారు. శునకాలకు ఆహారం, శుభ్రతను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. డంప్‌యార్డుకు చేరుతున్న చెత్తలో పెద్ద మొత్తంలో మిశ్రమ వ్యర్థాలు ఉండటం కారణంగా రీసైక్లింగ్ వ్యవస్థపై భారం పెరుగుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లోని వీధి కుక్కలను గార్గేయపురం డంప్‌యార్డుకు తరలిస్తున్నట్లు తెలిపారు. డి.సి. సతీష్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ఇంచార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి డా.నాగశివప్రసాద్, డీఈఈలు ఫణిరాం, క్రిష్ణలత, వెటర్నరీ వైద్యుడు మల్లన్న పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే

- నగరంలో జ్యోతిరావు పూలేకు నివాళి



జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న సుధాకర్‌బాబు

కర్నూలు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యుడు ఎం.సుధాకర్ బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. సామాజిక కార్యకర్తగా, మేధావిగా, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్తగా, రచయితగా పనిచేశారన్నారు. బడుగు, బలహీనవర్గాలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి మహిళోద్ధరణకు కృషి చేశాడని కొనియాడారు. బి.బ్రతుకన్న, బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, ఇలియాస్ బాషా, జాన్ సదానందం పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి కార్యాలయంలో నివాళి అర్పించారు. సభ్యులు రేవతి, చిరంజీవమ్మ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: సాంఘిక విప్లవ పితామహుడు మహాత్మాజ్యోతి రావు పూలే అని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం కొత్తబస్టాండు సమీపంలోని రజక వృత్తిదారుల సంఘం కార్యాలయంలో పూలే 135వ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, రజక వృత్తాదారుల సంఘం కార్యదర్శి సి.గురుశేఖర్, విజయమ్మ, శేషాద్రి, సి.జయమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: సమాజానికి పూలే సేవలు అమూల్యమైనవని ప్రిన్సిపాల్ డా.నాగస్వామి నాయక్ అన్నారు. శుక్రవారం బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నివాళి అర్పించారు. విద్య మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం పోరాడి మార్గదర్శకులయ్యారన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్హత సాధించిన కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి, పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి నగేష్, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ 2020, 22 నవంబరులో నోటిఫికేషన్ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వ పట్టించుకోకుండా నిర్వహించకుండా వదిలేసిందని, టీడీపీ ప్రభుత్వం పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేసిందన్నారు. అయితే ఇంకా ఎంపికైన అభ్యర్థులకు ట్రైనింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'నైపుణ్య శిక్షణతో ఉద్యోగావకాశాలు'

కర్నూలు కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉద్యోగావకాశాలు వస్తాయని ఓజేటీ ట్రీమెన్ కమిటీ సభ్యుడు రామకృష్ణ అన్నారు. శుక్రవారం కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా నైస్ ఎడ్యుకేషన్ సొసైటీ, నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో అవగాహన కల్పించారు మల్లికార్జున, సోమేష్, ఎస్వీ నాగిరెడ్డి, బి.జ్యోతి, ట్రైనర్ రాయపాటి నాగలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం శిక్షణ ముగించుకున్న 30 మంది విద్యార్థినులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

పర్యవేక్షణ బాధ్యత విభాగాధిపతులదే

కర్నూలు న్యూసిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బాధ్యత విభాగాధిపతులదే అని కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. కార్యాలయంలో విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్ను, ఏబీసీ ఆపరేషన్లు, కోర్టు మార్గదర్శకాల అమలు, ఎల్ఆర్ఎస్, బీపీఎస్ , టిడ్కో గృహాల కేటాయింపు అంశాలపై సమీక్షించారు. డి.సి.సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డా.నాగశివప్రసాద్, ఇన్‌చార్జి సీపీ బీ.వెం కటరమణ, ఆర్వో జునైడ్, ఎంఈ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో అవకాశం ఇవ్వాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల ప్రమోషన్లలో దివ్యాంగ ఉద్యోగులకు అవకాశం ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాషా కోరారు. శుక్రవారం డీపీవో భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు.పంచాయతీరాజ్ శాఖలో జరుగుతున్న ప్రమోషన్‌లో కేటాయించిన రోస్టర్ ఓహెచ్‌ను శారీరక దివ్యాంగులకే కేటాయిం చాలన్నారు. అంజి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకోవాలి

గూడూరు నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను రైతులు వినియోగించుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు జె.సురేష్ అన్నారు. శుక్రవారం బుడిదపాడు గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం'లో భాగంగా రైతులకు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించామన్నారు.

జీతాల చెల్లింపులో అలసత్వం వద్దు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్మికుల జీతాల చెల్లింపులో అలసత్వం వహించవద్దని కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఈమేరకు అన్ని విభాగాల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి నెల జీతాల బిల్లులను ట్రెజరీకి పంపాలన్నారు. ఆప్కాస్, టైమ్‌స్కేల్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల విషయంలో నిక్కచ్చిగా వ్యవహించాలని సూచించారు.

ఆర్‌యూ విద్యార్థులపై సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలి

కర్నూలు అర్బన్ , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ విద్యార్థులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు సీమ కృష్ణ రాథోడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. బి.కాం మొదటి సంవత్సరం, బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థుల మధ్య జరిగిన చిన్న ఘర్షణను ర్యాగింగ్, సిగరెట్లతో కాల్చారని పక్కదారి పట్టించారని ఆరోపించారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ విషయపై సీఎంకు లేఖ రాశామన్నారు. 2023లో విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్లగా, సంక్రాంతికి చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఇంకా నెరవేర్చలేదన్నారు

అర్థికాభివృద్ధి చెందాలి

సి.బెళగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎం రమేష్ అన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలతో సమావేశం నిర్వహించారు. మహిళా రైతు గ్రూపులకు రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

ఆశాజ్యోతి పూలే

కర్నూలు హాస్పిటల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే అని తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు అన్నారు. బిర్లా సర్కిల్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి నివాళులర్పించారు. మాధవరాజు, పి.నాగరాజు, చిన్న రాముడు, కిరణ్ కుమార్, ఎం.వెంకటస్వామి, ప్రకాష్ ఆచారి పాల్గొన్నారు.

కొళాయిలకు తాగునీరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తాగునీరు పట్టుకుంటున్న స్థానికుడు

కోడుమూరు రూరల్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల గ్రామం లక్ష్మీమాధవస్వామి ఆలయంలోని కొళాయిలకు తాగునీటిని సరఫరా చేశారు. ఆలయంలో కొళాయిలకు తాగునీరు రాలేదదని శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఆలయంలో దాహం' శీర్షికన వెలువడిన కథనానికి సర్పంచ్, పంచాయతీ అధికారులు స్పందించారు. హంద్రీనదిలో దెబ్బతిన్న పైప్‌లైన్ మరమ్మతులు చేయించి, మధ్యాహ్నం మోటారు ఆన్ చేశారు.

పంచ సూత్రాలతో రైతు అభివృద్ధి



బ్రాహ్మణపల్లెలో ఇంటింటి ప్రచారం

ఓర్వకల్లు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పంచ సూత్రాలతో అభివృద్ధి సాధ్యమని టీడీపీ కన్వీనర్ బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో రైతన్న మీకోసం' నిర్వహించారు. పాడి పశువుల పెంపకం, ఎరువుల వాడకాన్ని తగ్గించడం, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. వీఏఏ ప్రియాంక, ఎంపీఈవో, ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్ చౌదరి ఆంజనేయులు, పుల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఏపీసీకి అభినందనలు



లోకేరాజును కలిసిన ఉద్యోగులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఏపీసీ లోకేరాజుకు ఉద్యోగులు అభినందించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కో చైర్మన్ మహ్మద్ రఫీ, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రాజు సన్మానించారు. సభ్యులు పుల్లన్న, మధు, ఉరుకుందు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు ప్రారంభం



క్రీడా ప్రాంగణాలను ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పసుపుల గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణాలను హెచ్ఎం ఎస్.విజయమ్మ శుక్రవారం ప్రారంభించారు. విశిష్ట అతిథిగా సర్పంచ్ బొగ్గుల శీలమ్మ పాల్గొన్నారు. చదువుతో పాటు క్రీడలు అవసర మన్నారు. క్రీడలకు సహకారం అందిస్తామన్నారు. ఇక్కడ వెయిట్ లిఫ్టింగ్, బాల్ బ్యాడ్మింటన్, సెపక్‌తక్రా, వాలీబాల్, టెన్నికాయిట్, త్రోబాల్ తదితర ఆడుకోవచ్చని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి హేమంత్ కుమార్ రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ సంతోషమ్మ ఉన్నారు.

వ్యవసాయం పై శిక్షణ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం టీటీడీసీ మీటింగ్ హాల్లో సమీకృత వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంబిం చాలన్నారు. రంగనాథ్, మాధురి, సుబాన్ బాషా, ఊతప్ప ఉన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

ఇరుక్కుపోయే దారి



గూడూరు-కోడుమూరు రహదారి ఇలా..

గూడూరు నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రహదారులు ఇరుకుగా మారడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. కర్నూలు-ఎమ్మిగనూరు ప్రధాన రహదారితో పాటు కోడుమూరు-సుంకేసుల రహదారి 40 అగుడులు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. పట్టణంలో దాదాపు 30వేలకు పైగా జనాభా ఉంది. నగర పంచాయతీగా మారినా రహదారులను విస్తరించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రహదారిపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటం మరో సమస్య. ఎదురుగా వాహనం వస్తే మరొక వాహనం ముందుకు కదిలే అవకాశం లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులను విస్తరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

జిన్నింగ్ పరిశ్రమ తనిఖీ


సెక్రెటరీతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ కొండయ్య

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : సీసీఐ కొనుగోలు చేస్తున్న జిన్నింగ్ పరిశ్రమలను శుక్రవారం ఆదోని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ కొండయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి, విక్రయానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. స్లాట్ బుకింగ్ కోసం అవస్థలు పడుతున్నామని గంటల తరబడి సెల్‌ఫోన్ పట్టుకొని ఉండాల్సి వస్తుందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అవసరమైతే మరిన్ని జిన్నింగ్ పరిశ్రమలు పెంచాలని సూచించిందని తెలిపారు. త్వరలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. కనీస మద్దతు ధరకు సీసీఐకి విక్రయించుకొని వచ్చిన రైతుల పత్తి తిరస్కరించవద్దని సీసీఐ వ్యాపారులకు తెలిపారు. సీసీఐ తిరస్కరిస్తే పరిశ్రమలోనే వ్యాపారులు కొనుగోలు చేయించాలని మార్కెట్ యార్డ్ సెక్రెటరీ ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ యార్డ్ సెక్రెటరీ గోవిందు, తాసీల్దార్ రమేష్, సూపర్వైజర్ అశోక్ పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

వెల్దుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):మండలంలో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వెల్దుర్తిలో ఆయన స్వగృహంలో శ్రీ గిరి గోవర్ధన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 'నివ భూప హెల్త్ ఇన్సూరెన్స్' సంస్థ 'జాబ్ మేళా' కార్యక్రమం నిర్వహించింది. మండలంలో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏబీఎం షెహెనాజ్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మద్దికెర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని మండల విద్యాధికారి-2 మోహన్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందివాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని అమలు చేసిందని, విద్యార్థులకు చదువుతో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

డిప్యూటీ కలెక్టర్ ఆగ్రహం


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టరు

దేవనకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమయానికి విధులకు రాక, సక్రమంగా రికార్డుల నిర్వహణ లేదని, శుభ్రత కుడా సరిగలేదని వైద్యశాల వైద్యులు, సిబ్బందిపై డిప్యూటీ కలెక్టరు, హౌసింగ్ పీడీ చిరంజీవి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జడ్పీ పాఠశాలను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణ అధ్వాన్నంగా ఉండటంతో పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల హెచ్‌ఎంకు సుచించారు. తెర్నేకల్ సచివాలయంలో గృహలబ్ధిదారులతో మాట్లాడుతూ గతంలో పెండింగ్‌లో ఉన్న గృహాలను తొందరగా నిర్మించుకుంటే వేగంగా బిల్లులు మంజూరు అవుతాయన్నారు. పథకం నిర్దేశించిన గడువు పూర్తి కాకుంటే బిల్లులు మంజూరు కావన్నారు. నూతన గృహాలకు ఈ నెల 30లోగా సచివాలయాలలో దరఖాస్తు చేసుకొవాలన్నారు. డీప్యూటి కలెక్టరు వెంట ఎంపీడీవో జ్యోతి, ఉన్నారు.

గుడి గంట చోరీ

మద్దికెర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దమ్మ కుంట సమీపాన వెలసిన రజకుల ఆరాధ్య దేవత గంగమ్మ గుడిలో శుక్రవార తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో రూ.30వేలు విలువచేసే గుడి గంటను దోచుకెళ్లారని ఆలయ పూజారి మల్లేష్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే దేవాలయంలో పూజారిని కొట్టి డబ్బులు తీసుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. పోలీసులు విచారణ చేస్తున్నారు.

దక్షిణామూర్తి ఆలయంలో ప్రత్యేక పూజలు


గోపూజ చేస్తున్న భక్తులు

ఆస్పరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి గ్రామంలో టీటీడీ ధార్మిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నాలుగు రోజులుగా ఆలయ ప్రాంగణంలో తిరుమల తిరుపతి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉదయం గంగపూజ, గోపూజ, కుంకుమార్చన, శోభాయాత్రగా నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, రవిరెడ్డి, పెద్దరంగారెడ్డి, భీమిరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, కౌలుట్లయ్య, మురళీమోహన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆలూరు విద్యార్థి ఎంపిక

ఆలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అండర్-14 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1లో 8వ తరగతి చదువుతున్న శంకర్ రాష్ట్ర స్థాయి ఇంటర్ స్టేట్ క్రికెట్ పోటీలకు ఎన్నికయ్యాడు. శుక్రవారం నుంచి 3 రోజులపాటు గుంటూరులో జరిగే స్టేట్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటాడు. ఈ సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎన్నికైన విద్యార్థి శంకర్‌ను హెచ్‌ఎం సుధారాణి, పీడీ రాజశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

పోరాటాన్ని దారి మళ్లించేందుకే

అడ్డగోలుగా మండల విభజన

● ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక ఆగ్రహం

ఆదోని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలంలోని గ్రామాల అడ్డగోలు విభజనపై ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆదోనికి కేవలం ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న కొన్ని గ్రామాలను దాదాపు 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న పెద్దహరివాణం మండలంలో కలపడం వెనుక ఆదోని జిల్లా పోరాటాన్ని దారి మళ్లించే కుట్ర దాగి ఉందని ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్ అహమ్మద్ అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నూర్ అహమ్మద్ మాట్లాడుతూ విభజన కారణంగా ప్రజలు జిల్లా కేంద్రం పోరాటం వదిలిపెట్టి, మండల కేంద్రం గొడవలో పడేలా చేయడమే ఈ కుట్ర వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఈ కుట్రకు కారణమైన వారెవరో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి కుట్రలతో ఆదోని జిల్లా సెంటిమెంట్‌ను దెబ్బ తీయలేరని హెచ్చరించారు. ఎంతగా అణిచివేయాలని చూసినా, ఆదోని జిల్లా సాధన పోరాటం ఏ మాత్రం ఆగదని, తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేసింది. కోర్టు కేసుల గొడవలు తలెత్తకుండా పెద్దహరివాణం మండలం ఏర్పాటు చేయాలని ఐక్యవేదిక ప్రభుత్వాన్ని కోరింది. పెద్దతుంబళం మండలం ఏర్పాటుకు తాము మద్దతు తెలుపుతున్నామన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్ అహమ్మద్

న్యాయవాది వృత్తి ఎంతో దోహదపడింది

ఎమ్మెల్సీ బీటీ నాయుడు


ఎమ్మెల్సీ బీటీ నాయుడిని సన్మానించిన న్యాయవాదులు

ఆదోని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ ఎదుగుదలకు చదువుకున్న చదువుతో పాటు న్యాయవాది వృత్తి ఎంతో దోహదపడిందని ఎమ్మెల్సీ బీటీ నాయుడు పేర్కొన్నారు. రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైనందుకు శుక్రవారం ఆదోని న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, జీవన్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా కావడం ప్రజల ఆశీస్సులతోనే సాధ్యమైందన్నారు. ఆదోని కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి, జూనియర్ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఆదోని న్యాయవాదుల సంఘం తరపున ఎమ్మెల్సీకి వినతి పత్రం అందించారు. ఆదోని న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేష్, సీనియర్ న్యాయవాదులు విశ్వనాథ్‌రెడ్డి, రామిరెడ్డి, దేశాయ్, వై.ఆర్.మల్లికార్జున, యూజీ శ్రీనివాసులు, నాగేంద్రయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధిత కుటుంబ సభ్యులతో మీనాక్షినాయుడు

ఆదోని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల కష్టాల్లో అండగా నిలవడమే నిజమైన ప్రజా నాయకుడి లక్ష్యమని, తమ ప్రభుత్వం అందిస్తున్న సహాయం ప్రతిబిక్క పేదవారి జీవితంలో వెలుగులు నింపాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు అన్నారు. శుక్రవారం వారి స్వగృహంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితా 39 కుటుంబాలకు గానూ రూ.13.69 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు పాల్గొన్నారు.

● ఆదోని పట్టణంలో టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు నివాసంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆదోని పట్టణం నుంచేగాక పరిసర గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సమస్యలను మీనాక్షినాయుడు దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను విన్న మీనాక్షినాయుడు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, సోదరులు ఉమాపతినాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం చేపట్టాలి


ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో శనేశ్వరస్వామి దేవాలయం ఎదుట రహదారిలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పులకేశిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ వాల్మీకి శ్రీరాములు, టీడీపీ ఉపాధ్యక్షులు బోయ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కురుకుంద గ్రామంలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు నిల్వ ఉంటుందన్నారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, వెంటనే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. హనుమంతు, వెంకటేశ్వర్లు, శీను పాల్గొన్నారు.

గిట్టుబాటు ఉండే పంటలను సాగు చేయాలి

తుగ్గలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):రైతులు పంటలు సాగు చేసే సమయంలో ఏ పంటైతే గిట్టుబాటు ధరలు ఉంటాయో ఆ పంటలను సాగు చేయడం ఎంతో లాభసాటి అని మారెళ్ల, ఉప్పర్లపల్లి సొసైటీల అధ్యక్షులు వైపీ ప్రభాకర్ రెడ్డి, అప్పా వేణుగోపాల్, ఏవో సుధాకర్ యాదవ్, మాజీ సర్పంచ్ బర్మా వీరేష్ అన్నారు. ఎద్దులదొడ్డి, పెండేకల్, ఉప్పర్లపల్లి గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

ఆలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం ఎం.కొట్టాల గ్రామంలో గురువారం గోకులం షెడ్ నిర్మాణాలకు అధికారులు ప్రోటోకాల్ లేకున్నా టీడీపీ నాయకులతో పూజలు చేయించి ఫ్లెక్సీలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఫొటో వేయకుండా అవమానించారని, ఈ విషయంపై ఆలూరు మండల అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు వైసీపీ సమాచారచట్ట విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టాల రాజు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉపాధి హామీ పథకం శాఖ ద్వారా పల్లె పండగ నిధులు కేటాయించి నిర్మిస్తున్న గోకులం షెడ్ నిర్మాణానికి సంబంధించిన ఫ్లెక్సీలో సీఎంతో పాటు జిల్లాలోని మంత్రులు, ఎంపీతోపాటు ప్రోటోకాల్ లేని వారి ఫొటోలు వేయడం అధికా రులకు సమంజసం కాదన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి


బహుమతి ప్రధానం చేస్తున్న న్యాయాధికారి భారతి

మద్దికెర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి క్రీడాకారుడు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని పత్తికొండ సివిల్ జడ్జి భారతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలో రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో మొదటి స్థానంలో వచ్చిన శేఖర్‌కు రూ.10వేలు అందజేశారు. జడ్జీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పరుగు పందెం పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. క్రీడలు చదువు, క్రమశిక్షణ ఉన్న వారు ఎప్పటికైనా ప్రయోజకులు అవుతారన్నారు. నిర్వహకులు విజయ్ ప్రసాద్ యాదవ్, ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షులు చొక్కా సునీల్ కుమార్, శ్రీ విద్యాసాయి కళాశాల ఎండీ యజ్ఞం వెంకట మాదవ్, పులికొండ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. శుక్రవారం ఆలూరు పట్టణంలోని ఆమె స్వగృహంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులను పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపుతామని ఆమె తెలిపారు. ప్రజలు వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసం ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సాయిమాధవ్

వెల్దుర్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):వెల్దుర్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి కర్నూలు, డోన్ పట్టణాలకు వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వెల్దుర్తిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల నాయకుడు రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు దోని, కేశవ, ప్రవీణ్, మనోజ్ పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాల కోసం పని చేయండి

● మండల మీట్‌లో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

పత్తికొండ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారులారా నిర్లక్ష్యం వీడి... ప్రభుత్వ పరంగా రైతులకు అందే సబ్సిడీ పథకాలు, ఎరువులు, పురుగు మందులు, అందుబాటులో ఉన్నాయో లేదో రైతులకు తెలియజేసి వారి ప్రయోజనాలు కాపాడడంలో అధికారులు విఫలం అవుతున్నారని పత్తికొండ మండల మీట్‌లో శుక్రవారం ప్రజాప్రతినిధులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నారాయణదాస్ అధ్యక్షతన మండల మీట్ జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ కవిత, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రంగప్ప, వైస్ ఎంపీపీ బలరాముడు శాఖలవారీగా అధికారులతో మాట్లాడారు. ఎంపీపీ నారాయణదాస్ మాట్లాడుతూ ఉల్లి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం హెక్టారుకు రూ.50 వేలు చొప్పున పరిహారం ఇస్తామని చెప్పారని, ఇంతవరకూ ఆ హామీ నెరవేరలేదన్నారు. పెద్దహుల్తి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఓక లే అవుట్ ఏర్పాటు చేసి నిరుపేదలకు స్థలాలను ప్రభుత్వం కేటాయించిందని ఆ స్థలాలను ఆ గ్రామానికి చెందిన నాయకుడు, అధికారులు కుమ్మక్కై దొంగ పట్టాలను సృష్టించుకుని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి వెంకటరాముడు, ఆసుపత్రి సూపరింటెండెంట్ కల్పన, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీలు చక్రాళ్ల రాజు, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.


మండల మీట్‌లో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

విద్యార్థి సంఘాల నిరసన


మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న నాయకులు

ఆదోని, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లాగా ప్రకటించాలనే డిమాండ్‌ను డీఎస్ఎఫ్, పీడీఎస్ఓ విద్యార్థి సంఘాలు శుక్రవారం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఎమ్మిగనూరు సర్కిల్ నుంచి భీమా సర్కిల్‌లోని దీక్షా శిబిరం వరకు పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి సంఘీభావం తెలుపుతూ ర్యాలీ సాగింది. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఢణాపురం ఉదయ్ మాట్లాడుతూ ఆదోనిని జిల్లా సాధనకై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లా కో కన్వీనర్ రాజేష్, డివిజన్ సెక్రటరీ శివ, ముఖ్య నాయకులు రాజు, రంగస్వామి, జిల్లా జేఏసీ నాయకులు నరేంద్రయాదవ్, పాల్గొన్నారు.

పౌరాణిక కళలను ప్రోత్సహించాలి


కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

మద్దికెర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న పౌరాణిక కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుబ్రహ్మణ్య స్వామి ఆలయ నిర్వహకులు విజయప్రసాద్ యాదవ్ అన్నారు. మద్దికెర గ్రామంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఆణిముత్యాలు ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు గోవిందు, కంబగిరి స్వామి, వెంకటేశ్వరరావు, దుర్యోధన పాత్రదారి వాల్మీకి రాముడు తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులికొండ, హరిప్రసాద్, నాగప్రసాద్, జయరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన షష్ఠి ఉత్సవాలు

మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలోని మద్దమ్మ కుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన షష్ఠి ఉత్సవాలు ముగిశాయి. శుక్రవారం ఆలయ నిర్వహకులు విజయప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో మూలవిరాట్ సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంప్యూటర్ ఆపరేటర్ లేక ఇబ్బందులు


వేచివున్న దరఖాస్తుదారులు

దేవనకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో ధ్రువపత్రాల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల కంప్యూటర్ ఆపరేటరే, తహసీల్దార్ కార్యాలయ పనులు చేస్తుండటంతో ధ్రువపత్రాల కోసం వచ్చే వారిపై విసుక్కుంటున్నారు. దాదాపు రెండేళ్లుగా కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో, ఆస్పరి నుంచి తాత్కలిక ఆపరేటర్‌తో పాటు, వీఆర్వోలు కంప్యూటర్ విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఆపరేటర్ లేకపోవడంతో కుల, ఆదాయ, పొజిషన్, కుంటుబ సభ్యుల, తదితర ధ్రువపత్రాల దరఖాస్తుదారులకు నిర్ధేశిత సమయంలోగా అందడం లేదు. దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేయాల్సి వస్తోంది. రెగ్యులర్ కంప్యూటర్ ఆపరేటర్‌ని నియమించి ఇబ్బందులు లేకుండా చుడాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు


డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ

తుగ్గలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదమని తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు బాలనరసింహులు, మల్లికార్జున అన్నారు. శుక్రవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరిలో వాహనాలు తనిఖీలు చేసి కౌన్సె లింగ్ ఇచ్చారు. నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

ఉపాధ్యాయులందరూ క్రీడల్లో పాల్గొనాలి

తుగ్గలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మానసికంగా, బలంగా ఉండాలంటే ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు క్రీడల్లో పాల్గొనాలని ఎంఈవో రమా వెంకటేశ్ గౌడు, జిల్లా పీఈటీల సంఘం కార్యదర్శి చందూ నాయక్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని జొన్నగిరిలో వారు మాట్లాడుతూ తుగ్గలి మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరూ నేడు జొన్నగిరి జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో క్రికెట్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్, పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామనీ, 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. పీఈటీలు పాండురంగరాజు, వేణుగోపాల్, రంగస్వామి, నలోమి, భాస్కర్, పక్కీరప్ప ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

తుగ్గలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థలం ఉండి అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడు ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ లోపు మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సిన వారు ప్రభుత్వ బిల్లుల మంజూరు కోసం ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉంటే ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఫొటో తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించుకోవాలన్నారు. ఇల్లు మంజూరైతే ప్రభుత్వం రూ.1.80లక్షలు అందిస్తుందన్నారు.

సచివాలయాలకు రాజకీయ గ్రహణం

● చెట్నహళ్లి, రచ్చమర్రిలో గ్రామాల్లో ప్రారంభం కాని భవనాలు
● చెట్నహళ్లిలో కిటికీలు ధ్వంసం


రచ్చమర్రిలో నిర్మించిన సచివాలయ భవనం


చెట్నహళ్లిలో సచివాలయ కిటికీ అద్దాలను దుండగుల పగలగొట్టిన దృశ్యం

మంత్రాలయం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహళ్లి, రచ్చమర్రి గ్రామాల్లో రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాలను ప్రారంభించేందుకు రాజకీయ గ్రహణం పట్టింది. దాదాపు 15 నెలలుగా నిర్మాణం పనులు పూర్తయినా ఎవరితో ప్రారంభించాలన్నదే అసలైన సమస్యగా అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగులు పాతగా ఉన్న పంచాయతీ కార్యాలయంలో ఇరుకుగా ఉన్న గదిలోనే ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రారంభించే భవనాలకు ప్రభుత్వం మారినా రచ్చమర్రి సచివాలయం-2లో జగన్ మోహన్ రెడ్డి ఫొటో కూడిన నవరత్నాల బోర్డుతోనే ఇప్పటికీ దర్శనం ఇస్తోంది. రాష్ట్రంలో సచివాలయ భవనాలకు జగన్ చిత్రంతో కూడిన లోగోను తొలగించాలని అధికారులకు ఆదేశాలు వచ్చినా ఇక్కడి అధికారులు తొలగించడం లేదు. ప్రొటోకాల్ ప్రకారం మంత్రాలయం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉంది. అయితే ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న రాఘవేంద్రరెడ్డితో ప్రారంభించాలని అధికారులపై ఒత్తిడి ఉంది. ఈ ఇద్దరి నాయకుల మధ్య అధికారులకు తలనొప్పిగా మారి గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రొటోకాల్ ప్రకారం అధికారులతోనే ప్రారంభించాలని ఆదేశాలు వచ్చా యని మంత్రాలయం ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. ఒక్కో భవనం రూ.40 లక్షలతో నిర్మించి పనులు పూర్తయి ఏడాదిన్నర కావస్తున్నా ప్రారంభించక పోవడంతో దుండగుల చేతుల్లో చెట్నహళ్లి సచివాలయ భవనానికి ఉన్న కిటికీ అద్దాలు పగులకొట్టారు. తలుపులు సైతం విరగొట్టే ప్రయత్నాలు చేస్తుండటంతో ఆయా గ్రామస్తులు భవనాలు ప్రారంభించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరుతున్నారు.

కొత్త భవనాలను అప్పగించాం



మండలంలో పూర్తయిన రచ్చమర్రి, చెట్నహళ్లి సచివాల యాలను గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, ఇంజ నీరింగ్ అసిస్టెంట్‌కు అప్ప గించాం. కొత్త సచివాలయాల్లో ప్రజలకు సేవలు అందించ వచ్చు. శిథిలావస్థకు చేరిన, పగులకొట్టిన కిటికి అద్దాలను గ్రామ సర్పంచ్ మరమ్మతులు చేయించాల్సి ఉంది. ఇరుకు గదుల్లో వదిలేసి కొత్త భవనాల్లో విధులు నిర్వహించుకోవచ్చు. దీనికి ఎటువంటి ఆటంకం లేదు.
- మల్లయ్య, పంచాయతీరాజ్ ఏఈ, మంత్రాలయం.

కడిమెట్లకు బస్సు సౌకర్యం ప్రారంభం


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్ల గ్రామానికి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు టీడీపీ మండల కన్వీనర్ కేటీ వెంకటేశ్వర్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఎమ్మిగనూరు పట్టణానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గ్రామంలోని విద్యార్థులు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన ఆర్టీసి అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేలా కృషి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ విరుపాక్షిరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, సోగనూరు రాఘవేంద్ర, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ తీగను సరిచేశారు


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
విద్యుత్ వైర్‌ను సరిచేస్తున్న సిబ్బంది

పెద్దకడబూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నతుంబళం గ్రామ పాఠశాలలో ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ తీగపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు విద్యార్థులకు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగను మార్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాన పథకానికి విరాళం

మంత్రాలయం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన హిందుమతి అనే భక్తురాలు అన్నదానం, వస్త్రసేవకు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని చెక్కును ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాజశేఖర్ బాధ్యతలు



కౌతాళం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కౌతాళం ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్‌కు ఏపీడీగా పదోన్నతి రావడంతో నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో మండలంలో ఎంపీడీవో స్థానం ఖాళీ కావడంతో ఇక్కడే డిప్యూటీ ఎంపీడీవో విధులు నిర్వర్తిస్తున్న రాజశేఖర్‌కు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అధికారులు అప్పజెప్పారు. దీంతో శుక్రవారం ఉదయం ఎంపీడీవోగా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. మండలాభివృద్ధికి అన్ని పార్టీల నాయకులను అధికారులతో కలిసి పని చేస్తానని చెప్పారు.

నిరక్షరాస్యతను రూపుమాపాలి


మహిళలకు శిక్షణ ఇస్తున్న ఏపీఎం జయశ్రీ

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యతను రూపుమాపాలని ఏపీఎం జయశ్రీ అన్నారు. ఎమ్మిగనూరు వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అక్షరాంధ్ర శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఏపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఏవో అనుసూయమ్మ, వయోజన విద్యా సూపర్‌వైజర్ రమణయ్య హాజరయ్యారు. ఏవో మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలంలో ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో అభ్యాసకులకు చదవడం, రాయడం, చిన్నచిన్న లెక్కలు చేయించడం, ఆర్థిక అక్షరాస్యతపై వివరించామన్నారు. మండలంలో 3,920మంది అభ్యాసకులకు ప్రతి రోజు సాయంత్రం తరగతులు నిర్వహించాలన్నారు. వీరికి మార్చినెలలో ఎన్ఐవోఎస్ పరీక్షలు నిర్వహించి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన అవసరం


మహిళలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌పీసీ ఆర్పీ

గోనెగండ్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరం అని డీఆర్‌పీసీ రిసోర్స్ పర్సన్ అస్రఫ్ బాషా, పంచాయతీ కార్యదర్శి సతీశ్ అన్నారు. శుక్రవారం గోనెగండ్లలోని బీసీ కాలనీ, లక్ష్మీపేట, మొట్టి వీధుల్లో వారు ఇంటింటి వెళ్లి మహిళలకు తడి, పొడి చెత్తల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, సుభాన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు చేరిన దీక్ష

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ లో విధులు నిర్వర్తిస్తూ మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలంటూ చేపట్టిన రిలే దీక్ష శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ విజయేంద్ర అధ్యక్షత వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఏఐటీయూసీ కార్యదర్శి తిమ్మగురుడు మాట్లాడుతూ నాలుగేళ్లుగా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శులు రంగన్న, ఆశా జ్యోతి, ఆగారమ్మ, సుమాంజలి, నబి నసీమా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి మాక్ అసెంబ్లీకి ఎంపికైన తొమ్మిదో తరగతి విద్యార్థి నవనీత్ కుమార్, తల్లి శ్యామలా బాయి, పాఠశాల హెచ్‌ఎం గౌరమ్మ, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు అబ్దుల్ రహిమాన్, దాదాబాషా, నాగవేణిని ఎమ్మెల్యే తన ఇంటి వద్ద ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో పెనుమార్పులు తీసుకొస్తున్నారన్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటు అంశం తీసుకురావటం విద్యార్థికి చదువుపై ఉన్న శ్రద్ధను తెలియజేస్తోందన్నారు. అసెంబ్లీలో ఎలా ఉండాలో చిన్నారులతో సీఎం చంద్రబాబు నాయుడు చెప్పించారన్నారు. మాక్ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా వ్యవహరించిన నవనీత్ కుమార్‌కు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభకు రాకుండా ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16నెలల్లోనే అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తున్నామన్నారు. టీడీపీ నాయకులు మాచాని మహేశ్, మిన్నప్ప, మహేంద్ర బాబు, చిన్నరాముడు, తిమ్మారెడ్డి, తిరుపతయ్య నాయుడు, రామాంజనేయులు, కాశీం వలి, ధర్మపురం గోపాల్, అంజి, జగదీష్, గౌస్‌పీరా, నరసింహులు, రాఘవేంద్ర, శేఖర్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి స్మారక అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రారంభించారు. ముందుగా మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఎన్టీఆర్, బీవీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మైదానంలో క్రీడాకారును పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తొమ్మిదిఏళ్లుగా బీవీ స్మారక క్రికెట్‌ను క్రీడాకారులకోసం నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 130 జట్లు రావటం సంతోషకరమన్నారు. టీడీపీ నాయకులు బాస్కర్ల చంద్రశేఖర్, ఆర్గనైజర్లు మల్లా కలీముల్లా, బార్గవ్, రంగస్వామి గౌడ్, సురేశ్, మహేశ్, నవాజ్, భీమేష్, నరసప్ప, రామకృష్ణ నాయుడు, బీజేపీ నరసింహులు, పీఏసీఎస్ అధ్యక్షులు విరుపాక్షి రెడ్డి, గౌస్ పీరా, మార్కెట్ చైర్మన్ మల్లయ్య పాల్గొన్నారు.

రైల్వే పట్టాలపై వ్యక్తి మృతదేహం

కోసిగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని రైల్వే స్టేషన్ పరిధిలోని రైలు పట్టాలపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. కోసిగి రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమీప వ్యక్తులు సమాచారం ఇవ్వగా.. 108 సిబ్బంది శాంతమూర్తి, జగదీష్ చేరుకుని మృతుని జేబులో ఉన్న డబ్బులు, రైలు టికెట్‌ను ట్రాక్‌మెన్‌కు అందజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జవహర్ నవోదయ విద్యాలయంలో యూత్ గ్రామ సభ

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ మోడల్ యూత్ గ్రామ సభ కార్యక్రమాన్ని విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ గ్రామ సభ కార్యక్రమానికి విద్యాలయంలోని 11, 9, 8వ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. పంచాయత్‌రాజ్ సంస్థలు(పీఆర్ఐలు), స్థానిక పాలన నిర్మాణం, నిర్ణయం తీసుకోవడం-ఏకాభిప్రాయం- నిర్మాణం, ప్రజా వ్యవహారాల్లో పారదర్శకత, జవాబుదారితనం, ప్రజాస్వామ్య నిర్ణయం తీసుకోవడాన్ని అనుభవించడానికి ఇది నాయకత్వం, భాగస్వామ్యం, కమ్యూనికేషన్స్ విమర్శనాత్మక ఆలోచనవంటి విలువలను ప్రోత్సహిస్తుందన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య ఆదర్శాలకు అనుగుణంగా వీలుకల్పిస్తుందని ప్రిన్సిపాల్ పద్మావతి విద్యార్థులకు తెలియజేశారు. పీజీటీ హిస్టరీ బసవరాజు, లోకనాథ్, వెంకటేశ్వర్లు, జగన్నాథ్, వెంకటయ్య, వెంకటేష్, కరీం, చాంద్‌బాషా లు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి

మంత్రాలయం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని రచ్చమర్రి గ్రామానికి చెందిన వైసీపీ కుటుంబాలు బోయ కోసిగి హను మంతు, రోగప్ప, శివ, యాగంటి పాలప్ప టీడీపీలోకి చేరారు. శుక్రవారం మాధవరం గ్రామంలో టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నివాసంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్ఎం గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు ఉసేని , వెంకటేష్, శివ, లింగమయ్య, మజ్జిగ వీరేష్, నారాయణ, గుర్నింటి భీమిరెడ్డి, నాగరాజు, బూదిరెడ్డి, రామయ్య, జయరాం, కేశన్న, బొజ్జప్ప పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా


మురళీకృష్ణమ రాజు దొర

కోసిగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన కోసిగి దొరల వంశస్థులు వారసుల్లో ఒకరైన కాంగ్రెస్ పార్టీ మంత్రాలయం ఇన్‌చార్జి మురళీకృష్ణమ రాజు దొర కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి డీసీసీ అధ్యక్షుడు లేక, పార్టీలో చురుకైన నాయకత్వం లేకపోవడంతో రాజీనామ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. విజయవాడలోని ఏపీసీసీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి తన రాజీనామాను ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన నాయకత్వం లేకపోవడం వల్ల నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు పార్టీలో సమస్యలు తెలియజేసినా పట్టించుకోలేదని అన్నారు. అయితే మురళీకృష్ణమరాజు దొర డోన్ టీడీపీ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు కావడంతో టీడీపీలో చేరే అవకాశం ఉన్నట్లు కోసిగిలో జోరుగా ప్రచారం అందుకుంది. తాను ఏ పార్టీలో చేరుతాననేది తమ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ముందడుగు వేస్తామని ఆయన తెలిపారు.

'రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి'


డీలర్లతో సమావేశమైన తహసీల్దార్

నందవరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసులు డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో మండల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ మహేశ్, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


మాచ్‌మాన్‌దొడ్డి గ్రామంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని మాచ్‌మాన్‌దొడ్డి గ్రామంలో శుక్రవారం రైతన్నా మీ కోసం- అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలను అందజేశారు. గ్రామంలో రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును ప్రారంభించారు. తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలు అధికంగా ఉన్నాయని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. టీడీపీ మండల కన్వీనర్ కేటీ వెంకటేశ్వర్లు, నాయకులు బొజ్జప్ప, మహేంద్ర, హనుమంతు, కుమ్మరి వెంకటేశ్, రంగన్న, మునిస్వామినాయుడు, చాకలి రంగస్వామి, నరేశ్, ఎంపీడీవో బంగారమ్మ, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో శివశంకర్, ఏఈవో నరసింహులు, ఏఈ జయన్న పాల్గొన్నారు.

పెద్దకడబూరు: చిన్నకడబూరు గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకులు దశరథరాముడు, చిన్న నరసన్న ఆధ్వర్యంలో వేరువేరుగా రైతన్నా మీ కోసం- అన్నదాత సుఖీభవ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందవరం: రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రైతన్న మీ కోసం కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందని టీడీపీ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త బాస్కర భట్ల చంద్రశేఖర్, మాదవరం రామకృష్ణారెడ్డి అన్నారు. కనకవీడు, నాగలదిన్నె గ్రామాల్లో శుక్రవారం రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని కనకవీడులో డబ్బా ఈరన్న, నాగలదిన్నెలో మాజీ సర్పంచ్ టీ. ఈరన్న, జబ్బార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ కాశీంవలీ, సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, మునాఫ్, సుధీర్, కిషోర్, వీరేశ్, సత్యారెడ్డి, పాల్గొన్నారు.


పల్లెపాడు గ్రామంలో..

కోసిగి: ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరుడు, మాంచాల సొసైటీ సింగిల్ విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. పల్లెపాడు గ్రామంలో ఏవో ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి అధ్యక్షతన రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ నర్సారెడ్డి, ఆర్లబండ సొసైటీ చైర్మన్ అయ్యన్న, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, జ్ఞానేష్, కోసిగయ్య, రంగారెడ్డి, వీరారెడ్డి, అయ్యప్ప, తాయన్న, ఈరయ్య, చిన్న మారెయ్య, చింతలయ్య, హనుమంతు, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

● డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు అభిప్రాయాల సేకరణ
● ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు యోగేశ్



మాట్లాడుతున్న ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు యోగేశ్


ఎమ్మిగనూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏఐసీసీ జిల్లా పరిశీలకుడు యోగేశ్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ఎమ్మిగనూరు కో-ఆర్డినేటర్ కాశీం వలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగమధు యాదవ్ హాజరయ్యారు. యోగేశ్ మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా కొత్త తరహాలో డీసీసీ అధ్యక్షుల ఎంపిక జరుగుతుందన్నారు. కర్నూలు డీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేసేందుకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నామని చెప్పారు. ఆయా నియోజకవర్గాల్లోని నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఎవరైన ఆశావాదులు, అర్హులు డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆదివారం వరకు కర్నూలులో ఉంటామని, దరఖాస్తులను పీసీసీ, ఏఐసీసీకి పంపుతామన్నారు. గోనెగండ్లకు చెందిన 30 మంది, నాగలదిన్నెకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేశ్ యాదవ్, నాయకులు ఆసీఫ్, కాశీం బేగ్, నరసప్ప, జైపాల్, నాగదిన్నే షబ్బీర్ దేశాయ్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా తిక్కతాత స్వామి ఉరుసు


తిక్కతాత స్వామికి నైవేద్యం తయారు చేస్తున్నభక్తులు

మంత్రాలయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెట్నహళ్లి గ్రామాల్లో వెలసిన తిక్కతాతస్వాముల ఉరుసు మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తిక్కతాత స్వామి విగ్రహాన్ని మేలతాళాలు, భజన, భజంత్రీలు, డప్పులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. తిక్కతాత సమాది వద్దకు ఊరేగింపుతో చేరుకుని గ్రాస్తులు వరుసగా నైవేద్యాలు తయారుచేసి స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సుగంధ ద్రవ్యాలు, పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు.

మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి


నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని నాయకులు వారి వారి కార్యాలయాలలో నిర్వహించారు. సోమప్ప సర్కిల్‌లో పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ సొసైటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆల్‌ఫ్రెడ్ రాజు, బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అమరేష్, మాల మహానాడు కార్యదర్శి నరసన్న ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. డాక్టర్ గణేష్, నరసన్న, సుమాల చార్లెస్, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు మెలకువలు పాటించాలి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు సాగుచేసే పంటల్లో మెలకువలు పాటించాలని కేవీకే ప్రధాన శస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు, రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ పంటల్లో విత్తన శుద్ధీకరణ, సరైన మోతాదు, పోషక నిర్వహణ, నీటి వినియోగం ఆప్టిమైజేషన్ వంటి విషయాలను రైతులకు తెలియజేశామన్నారు. పంటల్లో వచ్చే వివిధ రకాల సమస్యలు గుర్తించే విధానం, పరిష్కార మార్గాలను తెలియజేశారు. కార్యక్రమంలో జీఎం శ్రీలత, చక్రవర్తినాయక్, రైతులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

మంత్రాలయం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సస్యరక్షణ సమగ్ర తెగుళ్ల నివారణ వల్ల రైతులకు ఎన్నో లాభాలు ఉండడమే కాక తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ అన్నారు. శుక్రవారం వగరూరు, తిమ్మాపురం గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు, వ్యవసాయ సహాయకులు ఆధ్వర్యంలో ఐఎన్‌డీ జీపీపీ పొలంబడిలో భాగంగా రైతులకు ఏర్పాటు చేసి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా లో బాగంగా వరికోత ప్రయోగం నిర్వహించారు. ఏఈవో తిరుమలరెడ్డి, రాధ, శేఖర్, గోపినాథ్, ఈరన్న, రైతులు పాల్గొన్నారు.